Purification of the Soul
(Telugu)

# Tazkiyah- ఆత్మశుద్ధి




మూలం
మౌలానా వహీదుద్దీన్ ఖాన్

అనువాదం
S.M. గౌస్ మౌర్య

# TAZKIYAH

(Telugu)

# ఆత్మశుద్ధి

(తజ్కియా)

మూలం

మౌలానా వహీదుద్దీన్ ఖాన్

అనువాదం

ఎం.డి. గౌస్ మౌర్య

Telugu Translation by
**MD GOUSE MOURYA**
Contact:9533413339

No prior permission is required from the publisher for translation of this book and publication of its translation into any language

**First Edition: 2022**

**Goodword Books**
1, Nizamuddin West Market
New Delhi - 110 013
email : info@goodwordbooks.com
printed in india
**Contact : 9394003049, 9573522690**

# INDEX


| | చాప్టర్స్ | | పేజీ |
|---|---|---|---|
| 1. | ఇస్లాంలో ఆత్మశుద్ధి | -- | 01 |
| 2. | ఆత్మశుద్ధి వాస్తవికత | -- | 02 |
| 3. | ఆత్మశుద్ధి ప్రాముఖ్యత | -- | 03 |
| 4. | స్వర్గం పరిశుద్ధులకోసం | -- | 04 |
| 5. | హదీస్ - ఆత్మశుద్ధికి మార్గం | -- | 05 |
| 6. | ఆత్మశుద్ధి - ఒక నిరంతర ప్రక్రియ | -- | 06 |
| 7. | డీకండిషనింగ్ప్రక్రియ - తప్పుడు దృక్పథం నుండి తప్పించడం | -- | 07 |
| 8. | ఆత్మశుద్ధి - ఆధ్యాత్మికపోషణ | -- | 08 |
| 9. | ఆరాధనలలో ఇజ్తెహాద్ (షరియత్నియమాలఅన్వయం)కు అనుమతిలేదు | -- | 09 |
| 10. | అనునిత్యం ఆత్మశుద్ధి | -- | 11 |
| 11. | తప్పు చేసిన తర్వాత ఆత్మపరిశీలన | -- | 12 |
| 12. | హృదయశుద్ధి - మేధశుద్ధి | -- | 13 |
| 13. | మార్గదర్శకుని అవసరం | -- | 14 |
| 14. | ఆత్మశుద్ధి కోసం సాంగత్యం తప్పనిసరి | -- | 16 |
| 15. | మధ్యవర్తిత్వం లేకుండా | -- | 17 |
| 16. | ఆత్మశుద్ధికి ముందు | -- | 18 |
| 17. | ఆత్మశుద్ధి - ఆత్మపరిశీలన | -- | 20 |
| 18. | ఆత్మశుద్ధి - వినమ్రత | -- | 21 |
| 19. | ప్రవక్త సాంప్రదాయిక ప్రార్థనలు | -- | 22 |
| 20. | ఆత్మశుద్ధి - వేడుకోలు | -- | 23 |
| 21. | ఆత్మశుద్ధి బాహ్యరూపం | -- | 25 |
| 22. | మనస్సాక్షి ప్రక్షాళనకు మార్గదర్శి | -- | 26 |

| చాప్టర్స్ | | పేజీ |
|---|---|---|
| 23. ఆత్మశుద్ధి - విధానం | -- | 27 |
| 24. ఆత్మశుద్ధి - అత్యంత ప్రభావవంతమైన విధానం | -- | 28 |
| 25. ఆత్మశుద్ధి మాధ్యమం | -- | 29 |
| 26. ఆత్మశుద్ధి - మేధోవికాసానికి మూలం | -- | 30 |
| 27. ఆత్మశుద్ధి - జ్ఞానం | -- | 31 |
| 28. పరధ్యానం (distraction) నుండి మిమ్మల్ని మీరు రక్షించుకోండి | -- | 32 |
| 29. ఆత్మశుద్ధి - వర్తమాన అవసరాలు (Challenges) | -- | 33 |
| 30. ఆత్మశుద్ధి షరతు | -- | 34 |
| 31. సత్యాన్ని స్వీకరించుట | -- | 36 |
| 32. ఆత్మశుద్ధి - త్యాగం | -- | 37 |
| 33. ఆత్మశుద్ధి ఒక మానసిక ప్రక్రియ | -- | 38 |
| 34. సానుకూల మనస్తత్వ ప్రాముఖ్యత | -- | 39 |
| 35. ఆత్మపరిశీలన - ప్రక్షాళనకు మూలం | -- | 40 |
| 36. ఆత్మపరిశీలన ఎలా చేసుకోవాలి | -- | 41 |
| 37. ప్రశ్న పత్రాన్ని ముందుగానే చూడటం | -- | 43 |
| 38. ఆత్మశుద్ధి - ప్రపంచ పరిత్యాగము | -- | 44 |
| 39. ప్రక్షాళనకు ప్రేరకం | -- | 45 |
| 40. ఆత్మశుద్ధి కోసం సిద్ధమవడం | -- | 46 |
| 41. ఆత్మశుద్ధి అంశాన్ని వెదకటం | -- | 47 |
| 42. ఆత్మశుద్ధి ద్వారా సామీప్యత | -- | 48 |
| 43. ఆత్మశుద్ధి - మరణస్మరణ | -- | 50 |
| 44. ఆత్మశుద్ధి ఉద్దేశ్యం | -- | 51 |
| 45. ప్రక్షాళనకు ప్రమాణం | -- | 53 |

అనంత కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

## 1. ఇస్లాంలో ఆత్మశుద్ధి

ఖురాన్లో నాలుగు పనులను దైవప్రవక్త చేయవలసినదిగా ప్రస్తావించడం జరిగింది. వాటిలో 2:129 ప్రకారం తజ్కియా లేదా ఆత్మశుద్ధి ఒకటి. దీని ద్వారా ఆత్మశుద్ధి ఆవశ్యకత తెలుస్తోంది. విశ్వాసులు తమ జీవితాల్లో ఖచ్చితంగా ఆత్మశు ద్ధికి ప్రాధాన్యతనివ్వాలి. కాబట్టి సందేశదాతలు, సంఘసంస్కర్తలు తమ నిరంతర పరిశ్రమలో ఆత్మశుద్ధి ప్రక్రియకు విశేష స్థానం కల్పించటం అనివార్యం.

అరబీ భాషలో తజ్కియ అనే పదానికి ఆత్మశుద్ధి (purification) అని అర్థం. అనగా శుద్ధిచేయటం, మనోకాంక్షల నుండి షైతాన్ప్రలోభాలనుండి తమనితాము కాపాడుకోవడం, లోకుల నుండి ఎదురయ్యే బాధాకరమైన అనుభవాల ప్రతీకారం తీర్చుకోవడం నుండి తమనితాము రక్షించుకోవడం, సవ్యమైన మార్గం నుండి మళ్ళించే దుష్టప్రేరకాల బారినపడకుండా జీవించటం, మొదలగునవి.

వాస్తవం ఏమిటంటే మనిషిని సర్వశక్తిమంతుడైన అల్లాహ్సరైన స్వభావం కలవాడిగా సృష్టించాడు. కానీ ఒక జీవితంలో ఎదురయ్యే విభిన్న సవాళ్ళు మనిషి సరైనస్వభావంపై పరదాలు వేస్తాయి. మనిషి అటువంటి బాహ్య ప్రభావాలను

గుర్తించి, వాటినుండి నిరంతరం తననితాను సంరక్షించుకుంటూ ఉండాలి.

ఈ ఆత్మశుద్ధి నియమాల గురించి జనాలను జాగ్రత్తపరచడమే ప్రవక్త ప్రథమ కర్తవ్యం. ఈ విషయమై అతను జనాలకు నిరంతరం మార్గదర్శకం చేయాలి. అదేసమయంలో అతను ఈ వ్యవహారంలో ప్రజలకు ఆచరణాత్మక నమూనాగా మారాలి.

ప్రవక్త తన సమకాలీన మధ్య ప్రత్యక్షంగా ఈ పనిని చేసి చూపారు. ఆ తర్వాతి తరాల నడుమ ఈ పని పరోక్షరీతిలో కొనసాగుతుంది. ప్రవక్త సమస్త బోధనలు, ఆచరణలు సంపూర్ణరీతిలో హదీసు గ్రంథాల్లో, సీరత్ (ప్రవక్త జీవితచరిత్ర) గ్రంథాల్లో, ప్రవక్త అనుయాయులచరిత్రలో లిఖితమై ఉన్నాయి. తరువాతి తరాల వ్యక్తులు ఆ రికార్డు నుండి మార్గదర్శకంని పొందాలి. అధ్యయన సామర్థ్యం ఉన్నవారు స్వయంగా అధ్యయనం చేయాలి. స్వయంగా అధ్యయనం చేయలేనివారికి, సంఘసంస్కర్తలు తమ ఉపదేశాల ద్వారా ఆత్మశుద్ధి చేసే ఈ కోర్సును తమ జీవితాల్లో అలవర్చుకోవ్వాల్సిందిగా ప్రోత్సాహించాలి.

## 2. ఆత్మశుద్ధి వాస్తవికత

ప్రవక్త నిర్వర్తించవలసిన విధులలో ఆత్మశుద్ధి అనే విధితజ్కియ అనే పదంతో ప్రస్తావించబడింది. ఆత్మశుద్ధి చేసుకోవటం ప్రతీ విశ్వాసికి తప్పనిసరి. ఆత్మశుద్ధి జరగకపోతే ఖురాన్లో 3:79 లో చెప్పబడినట్లు రబ్బానీ (ధర్మవేత్త) వ్యక్తిత్వం జనించదు. వాస్తవం ఏమిటంటే, 20:76 ప్రకారం ఏ వ్యక్తి అయినా ఆత్మశుద్ధి ద్వారానే స్వర్గంలో ప్రవేశించగలుగుతాడు.

తజ్కియా అనే పదానికి అభివృద్ధి (growth) అనేది శాబ్దిక అర్థం. ఈ అభివృద్ధికి వృక్షం ఒక మంచి ఉదాహరణ. ఒక విత్తనం అభివృద్ధి చెందితే వృక్షము అవుతుంది. ఒక విత్తనం అనుకూల వాతావరణంలో వృద్ధి చెందటంతో మొదలై పచ్చని మహావృక్షముగా మారుతుంది. మనిషి చేసుకునే ఆత్మశుద్ధి వ్యవహారం కూడా

ఇంతే. ఈ విధంగా చూసుకున్నట్లయితే తజ్కియా లేదా ఆత్మశుద్ధిని ఆధ్యాత్మికాభివృద్ధి లేదా మానసిక ఎదుగుదల (intellectual development) అని కూడా మనిషిలో పరిశు ద్ధ వ్యక్తిత్వం జనిస్తుంది. ఆత్మశుద్ధి అనేది సుపరిచిత వాస్తవమే కానీ ఇదేదో అపరిచితమైనది కాదు. ఈ ఆత్మశుద్ధి మానవప్రయత్నం ద్వారా లభిస్తుంది. దీనికి ఒకకాల్పనిక మహనీయుని రహస్యప్రేరణకు ఎటువంటి సంబంధంలేదు.

## 3. ఆత్మశుద్ధి ప్రాముఖ్యత

విభిన్న హదీసు గ్రంథాలలో నమోదైన ఒక కథనం ఇలా ఉంది. తీర్పుదినం స్వర్గవాసులు స్వర్గంలో, నరకవాసులు నరకంలో ప్రవేశించాక అక్కడ మరణాన్ని తీసుకురావడం జరుగుతుంది. అది తెల్లని గొర్రెపిల్ల రూపంలో ఉంటుంది. స్వర్గనరకాల నడుమ దానిని నిలబెట్టటం జరుగుతుంది. ఓ స్వర్గవాసులు రారా మీరు దీన్ని గుర్తుపట్టారా అని అడగటం జరుగుతుంది. వారు దాన్ని గుర్తుపట్టి, దాని శిరచ్ఛేదనం చేసి అవును ఇది మరణం అని అంటారు.

ఆ తర్వాత నరకవాసులకు ఆ గొర్రెపిల్లను చూపించి దీన్ని మీరు గుర్తుపట్టారా అని ప్రశ్నించడం జరుగుతుంది. వారు తలపైకెత్తి చూసి అవును ఇది మరణమే అని అంటారు. మరణాన్ని వివరించవలసినదిగా ఆదేశించడం జరుగుతుంది. ఆ తర్వాత స్వర్గవాసులతో ఇక మీకు శాశ్వతజీవితం లభించింది మీకిక మరణం లేదు, నరకవాసులారా! మీకు కూడా శాశ్వత జీవితం ఇవ్వబడింది మీక్కూడా మరణంలేదని ప్రకటించ బడుతుంది. (సహిహ్ ముస్లిం -2849)

ఆత్మశుద్ధి అంటే, స్వర్గంలోని ఉన్నత ప్రదేశంలో జీవించే అర్హుడైన పరిశు ద్ధ వ్యక్తిత్వం (purified personality)గా తననితాను తీర్చిదిద్దుకోవడం. ప్రళయదినాన ఒక సంఘటన జరగనుంది. ఆరోజు పరిశుద్ధులు స్వర్గంలో అపరిశుద్ధులు నరకంలో ప్రవేశించాక మరణం అనే అంకం ముగిసిపోయింది, ఇక రెండువర్గాలవారు తమతమ

లోకాలలో శాశ్వతంగా ఉండాలని ప్రకటింపచేయడం జరుగుతుంది.

అదో విచిత్రమైన ఘడియ. స్వర్గపువాసులు తమకు శాశ్వత సంతోషాల ప్రపంచం దొరికిందని ఆనందంలో మునిగి తేలుతుంటారు. మరోవైపు నరకవాసులు వర్ణనాతీతమైన విచారంలో మునిగిపోతుంటారు. తమనుతాము పరిశుద్ధ పరచుకాకపోవటం వలన ఎంత పెద్దనష్టానికి గురయ్యామనే విషయం వారి నిత్యవేదన పీక్కు తింటుంది.

ఈ భావన ఆత్మశుద్ధి చేసుకోవడం కోసం నిస్సందేహంగా బలమైన ప్రేరణ కలిగిస్తుంది. ఆ సమయంలో బహుశా ఈ నరక శిక్ష నుండి బయటపడటం కోసం మళ్ళీ మరణం వస్తుందేమో అన్న చిన్నపాటు నమ్మకం కూడా వారిని వదిలి వెళ్తుంది. ఇది స్వర్గంవాసులకు శాశ్వతమైన ఆనందాన్ని ఇచ్చే క్షణం. అదేవిధంగా నరకవాసులకు శాశ్వత విచారానికి గురిచేసే ఘడియ.

## 4. స్వర్గం పరిశుద్ధులకోసం

సూరెతాహాలో స్వర్గం గురించి ఈ క్రింది విధంగా తెలపడం జరిగింది.

తమనితాము పరిశుద్ధ పరచుకున్న వారికోసమే స్వర్గం ఉంది (ఖురాన్ 20:76) (Paradise is for one who purifies himself ) ఈవాక్యం ప్రకారం ఆ లోకంలో తనను పరిశుద్ధ పరుచుకుని ఆత్మశుద్ధి పొందిన వ్యక్తిత్వంతో పరలోకానికి చేరుకున్న వారికోసమే స్వర్గం. ఈ వాస్తవం కురాన్లోని విభిన్న వాక్యాలలో ప్రస్ఫుటం చేయబడింది. వ్యక్తిగత లక్షణాలను భూమికగా స్వర్గంలో ప్రవేశించే తీర్పుచేయడం జరుగుతుందే కాని వర్గంతో ఉన్న సంబంధం ఆధారంగా కాదు.

తనని తాను పరిశుద్ధపరచు ఉన్న వ్యక్తికోసమే స్వర్గం ఉన్నది. శు ద్ధిపంచుకోవటం అంటే నిర్లక్ష్య జీవన విధానాన్ని విడనాడి చైతన్యవంతమైన జీవితాన్ని గడపటం. సత్యానికి అవరోధంగా ఉండే ప్రతివస్తువు నుండి తనని తాను కాపాడుకోవాలి. ఈ వ్యవహారంలో స్వార్థం ఆటంకం కలిగిస్తే దాన్ని ఉపేక్షించకూడదు.

కోరికలు గుర్రాలు అయితే వాటికి కళ్లెం వేసి పెట్టాలి. దౌర్జన్యం, అహంకారం వంటి మనోరుగ్మతలు మేల్కొన్నప్పుడు వాటిని లోలోనే పాతిపెట్టాలి. వగైరా...

తజ్కియా అంటే ఒక వస్తువులో ఉండే ప్రతికూల తత్వాలను తొలగించి శుద్ధ పరచడం. తద్వారా అది అనుకూల వాతావరణంలో తన స్వాభావిక ఉచ్ఛస్థాయికి చేరుకునేలా చేయడం. మహనీయ ప్రవక్తపై ఉన్న మహత్వపూర్ణమైన బాధ్యత ఆత్మశుద్ధి. ప్రవక్త అంతిమ ప్రయాస అల్లాహ్ప్రేమ తప్ప, మరే ప్రేమలేని హృదయం గల వ్యక్తులను తయారు చేయటం. మనోరుగ్మతలు లేని ఆత్మలను ఉనికిలోకి తీసుకురావడం. స్వర్గంలో విశ్వాసులైన తన దాసులకు లభించే ఉపాధిని ఈ భూలోకంలో ఉంటూనే పొందగలిగే వ్యక్తులను జన్మింప చేయటం.

స్వర్గ వ్యవహారం ఆత్మ ఆత్మశుద్ధితో ముడిపడి ఉంది. ఆత్మశుద్ధి స్వర్గప్రవేశానికి అవసరమైన ఒకేఒక షరతు. ఆత్మశుద్ధి జరగకుండా ఏవ్యక్తి కూడా స్వర్గంలో ప్రవేశించలేడు.

## 5. హదీస్ - ఆత్మశుద్ధికి మార్గం

ఒక పండితుడు ఇలా అంటాడు. ''హదీస్సంకలనాలు ఉన్న ఇంట్లో స్వయంగా ప్రవక్తే సంభాషిస్తునట్టు''. ఆ పండితుడు అంటున్నది కేవలం ప్రపక్త వాక్కు గురించే కాదు, దాని విశ్లేషణలో వెళితే ప్రవక్త సాంగత్యంలో ఉన్నట్టు అనే అర్థం కూడా వస్తుంది.

హదీసు గ్రంథాల్లో నిక్షిప్తమై ఉన్న ప్రవక్త బోధనలు ఏదో కాకతాళీయంగా చెప్పిన విషయాలు కావు. ప్రతిదానికి ఒక సందర్భం (background) ఉంది. ప్రవక్త వివిధ సందర్భాలలో వివిధ పరిస్థితులను ఎదుర్కొన్నారు. తన స్థితికి, అక్కడి అవసరాలకు అనుగుణంగా ప్రజలకు సలహాలు ఇచ్చేవారు. ఈ విధంగా ఆయన చెప్పిన ప్రతిమాట ఏదో ఒక సందర్భంతో ముడిపడి ఉంది. ప్రతిబోధన సమయోచిత ఔచిత్యంతో నిండి ఉంటుంది.

ఒకవేళ మనిషి తనలో హదీస్జిజ్ఞాస అత్యధికంగా పెంపొందించుకుంటే, హదీసుతోపాటు దానినేపథ్యాన్ని అర్థం చేసుకుంటె అతను ప్రవక్త సాంగిత్యంలో ప్రవేశించినట్లే. అతనిలో కేవలం ప్రవక్తప్రబోధనలు పుస్తకంలో చెబుతున్నాను అనే భావన ఉండదు. పంక్తుల మధ్య (between the lines) ప్రబోధనతోపాటు దాని నేపథ్యం కూడా మనసులో నెమరు వేసుకుంటూ ఉన్నాను అనే భావన తీవ్రరూపం దాల్చితే అతను ప్రవక్తసాంగిత్యంలో ఉన్నట్లు అనుభూతి చెందుతాడు. ఈవిధంగా హదీసు వ్యవహారంలో అతని ప్రభావం వెయ్యిరెట్లు పెరుగుతుంది.

ఈ దృక్కోణం నుండి చూస్తే తెలిసిందేమిటంటే హదీస్ అధ్యయనం చేసే వ్యక్తి కేవలం హదీస్మాత్రమే చదివినట్లుకాదు. అతను ప్రవక్త సహచరులతో పాటు ప్రవక్తసాంగీత్యంలో కూర్చున్నట్టు. ఇది హదీసులను ఒక సృజనాత్మక శైలిలో అధ్యయనం చేయడం. ఈ శైలిలో అధ్యయనం చేయడం నిస్సందేహంగా ఆత్మ శుద్ధి చేసుకోవడానికి రాజమార్గం అని చెప్పవచ్చు.

## 6. ఆత్మశుద్ధి - ఒక నిరంతర ప్రక్రియ

దైవప్రవక్త మొహమ్మద్గారి సతీమణి అయిన శ్రీ ఆయేషాగారు తన భర్త గురించి ఇలా అన్నారు. ‘‘దైవ ప్రవక్త ప్రతిసందర్భం (occasion)లో అల్లాహ్ను గుర్తుచేసుకునేవారు’’. (సహీబుఖారి, కితాబుల్జనాయిజ్) ఈ కథనం ద్వారా ఆత్మ శుద్ధి చేసుకునే రాచబాట ఏమిటో తెలిసిపోతుంది. అంటే ప్రవక్త వారు అన్నిసందర్భాలలో తనను తాను శుద్ధిచేసుకునేవారు అని చెప్పవచ్చు.

దీని ద్వారా తెలిసిందేమిటంటే ఆత్మశుద్ధి అనేది కొంతవ్యవధివరకు ఇచ్చే శిక్షణ కాదు. ఆత్మశుద్ధి అనేది నిరంతర ప్రక్రియ. ఒక విశ్వాసి సత్యాన్వేషణ చేసేటప్పుడు అతని మనస్సాక్షి మేలుకొలుపు ద్వారా అతని జీవితంలో ఎదురయ్యే ప్రతి సంఘటన లేదా అనుభవం అతని ప్రక్షాళనకు ప్రేరణగా మారుతుంది.

మరణం సంభవించే వరకు తజ్కియా అనబడే ఈ ఆత్మశుద్ధి కొనసాగుతుంది. ఏ విధంగానైతే ఆహారం ద్వారా శారీరక శక్తి లభిస్తుందో అదే విధంగా ఒక నిరంతర ప్రక్రియ ద్వారా పరిశుద్ధత సిద్ధిస్తుంది. సాధారణంగా కొంతకాలం పాటు ఇచ్చే శిక్షణ (training course) ఆత్మశుద్ధికు మార్గంగా భావించడం జరుగుతుంది. అంటే మదరసాల్లో ఒక నిర్ణీత కాలపరిమితిలో ధార్మిక విద్యనభ్యసించడం జరిగినట్టు ఆత్మశుద్ధి కూడా నిర్ణీత కాలపరిమితిలో పొందవచ్చు అని భావించడం జరుగుతుంది. కానీ వాస్తవం ఏమిటంటే, ఇలా భావించటం ఆత్మశుద్ధిని తక్కువగా అంచనా (underestimation) వేయుటమే అవుతుంది.

ఆత్మశుద్ధి నిరంతర మానసిక ప్రక్రియ ద్వారా సిద్ధిస్తుందే కానీ ఏ రకమైన తాత్కాలిక కోర్సు ద్వారా కాదు. ఆత్మశుద్ధి కోసం ఒక జాగృతమైన మనసు (awakened mind) అవసరం. ఇది అపరిమితమైన మేధోప్రక్రియ ద్వారా లభిస్తుందే కానీ, ఏదో తాత్కాలిక కోర్సులో పాల్గొనటం ద్వారా కాదు.

## 7. డీకండిషనింగ్ప్రక్రియ - తప్పుడు దృక్పథం నుండి తప్పించడం

ఆత్మశుద్ధి రాత్రింబవళ్ళు సాగే ఒక నిరంతర ప్రక్రియ. దీని గురించి ఒక హదీసులు ఒక మంచి ఉదాహరణ ద్వారా వివరించడం జరిగింది.

"ఇనుము మీద నీళ్ళు పడినప్పుడు ఏవిధంగానైతే ఇనుము తుప్పుపడుతుందో ఆ విధంగా హృదయాలకు కూడా తుప్పుపడుతుందని ప్రవక్త మొహమ్మద్తెలియజేశారు. సహచరులు, ఓప్రవక్తా! దాన్ని శుద్ధిపరిచే ప్రక్రియ ఏమిటి అని అడిగారు. దానికి సమాధానంగా మరణాన్ని అధిక ంగా కలవరించడం, ఖురాన్పఠించటం" అని ప్రవక్తవారు చెప్పారు. (మిష్కాత్ - 2168)

ఈ హదీసులోని ఉదాహరణ ద్వారా ఒక మానసిక వాస్తవికత తెలుపబడింది. సామాజిక పరిస్థితులు మనిషిలో కోపం, ద్వేషం, హింస, ప్రతీకారం మొదలగు

ప్రతికూల భావోద్వేగాలను జనింప చేస్తాయి. మనిషి వీలైనంత త్వరగా వీటిని అంతం చేయాలి. లేదంటే ఈ ప్రతికూల భావోద్వేగాలు మనసులో శాశ్వతంగా నాటుకుపోతాయి. వాటిని తొలగించడం అసాధ్యం అవుతుంది.

మానవ మెదడులో సచేతన మనసు (concious mind), అచేతన మనసు (unconscious mind) అనే రెండు పెద్దభాగాలు ఉన్నాయి. ఈ ప్రతికూల భావాలు ముందుగా చేతనమనసులో ప్రవేశిస్తాయి. వాటిని వెంటనే అక్కడి నుంచి తొలగించకపోతే, అవి మెల్లమెల్లగా అచేతనమనసులో తిష్టవేస్తాయి. అక్కడి నుంచి వాటిని తొలగించడం కష్టాసాధ్యమవుతుంది. మనిషి ప్రతిక్షణం తనని తాను పర్యవేక్షిస్తూ ఉండాలి. ప్రతిక్షణం తన ప్రతికూల భావాలను ప్రాసెస్ (process) చేసి సానుకూల భావాలుగా మార్చుకోవాలి. అంటే, తన కండిషనింగ్మైండ్ని, డీకండీషనింగ్చేయాలి. తన మనసుని శుద్ధిచేసి కాలుష్యంను తొలగిస్తూ ఉండాలి. ఈ డీకండిషనింగ్లేదా శుద్ధి చేసే మార్గమే స్మరించటం మరియు ఖుర్ఆన్ల వెలుగులో జీవన అంతిమపరిణామం గురించి ధ్యానించటం.

## 8. ఆత్మశుద్ధి - ఆధ్యాత్మిక పోషణ

శరీరానికి భౌతిక ఆహారం అవసరం. ఆహారం దేహానికి చేరవేస్తే అది ఆరోగ్యవంతం అవుతుంది. అదేవిధంగా ఆత్మకి కూడా ఆహారం అవసరం. అది ఆత్మకు చేరినప్పుడు, ఆత్మ ఆరోగ్యవంతం అవుతుంది. ఈ ప్రక్రియనే ఆత్మ ఆత్మ శుద్ధి లేదా శుద్ధిచేయబడిన ఆత్మ అంటారు.

ఖురాన్లోని 3:191 ప్రకారం ఆత్మకు ఆహారం యోచన. మనిషి చుట్టుపక్కల ఎల్లప్పుడూ కొన్నిసందర్భాలు తారసపడతాయి. సామాజిక, చారిత్రక, ప్రాపంచిక ప్రతి స్థాయిలో ఒక సంఘటన సంభవిస్తుంది. ఆ సంఘటనలపై యోచన చేయాలి. వాటిద్వారా గుణ పాఠాలను, ఉపదేశాలను పొందాలి. ఇదే ఆత్మకు ఆహారం. తనచుట్టూ నమోదవుతున్న సంఘటనలలో దైవిక మహిమలను వీక్షించే స్థాయికి

తన స్పృహను అభివృద్ధి చేసుకున్న వ్యక్తికి, అవి దేవుడిని స్మరించే మార్గాలు అయినప్పుడు అతడు దైవ వరప్రసాదాల విస్తరి పొందినట్లే. అతని ఆత్మ ఆ విస్తరినుంచి అతను తన ప్రభువుతో కలిసే వరకూ తనకి ఆరోగ్యాన్నిచ్చే ఆహారాన్ని పొందుతూ ఉంటుంది.

చుట్టూ జరిగే సంఘటనల నుండి గుణపాఠాలను గ్రహించ స్వభావాన్ని జాగ్రత్తపరచడమే ఆత్మశుద్ధికి ముఖ్యమైన దారి. ఈ పాఠాలను గ్రహించే స్వభావమే ఆత్మశుద్ధికి భూమిక. ఈ భూమిక మీదే ఆత్మశుద్ధి అనే పంట పండుతుంది. దీన్ని తోసిరాజని మరోచోట దీన్ని పండించే ప్రయత్నం చేయటం, రాతిపర్వతం మీద పచ్చని చెట్లను పెంచటానికి ప్రయత్నించడమే అవుతుంది.

ఆత్మశుద్ధి అనేది దైవప్రసాదితమే కానీ, గురుప్రసాదితం కాదు. దేవునికి దైవదాసునికి మధ్యగల మానసిక సంబంధం ఫలితంగా ఏర్పడేదే ఆత్మశుద్ధి. ఇది ఎవరు మధ్యవర్తి ద్వారా ఏర్పడేది కాదు. ఆత్మశుద్ధి వాస్తవ రూపంలో దేవుడు ఇచ్చిన బహుమానమే కాని, ఏ మానవుడు ఇచ్చే బహుమానం కాదు.

ఆత్మశుద్ధి అనేది వ్యక్తికి దేవుడి నుండి ప్రత్యక్షంగా లభించే వరప్రసాదం. మధ్యవర్తిత్వం ద్వారా లభించే ఆత్మశుద్ధి మరేమైనా అవ్వచ్చుకానీ, అది వాస్తవంగా ఆత్మశుద్ధి మాత్రం కాజాలదు.

## 9. ఆరాధనలలో ఇజ్తైహాద్ (షరియత్నియమాలఅన్వయం)కు అనుమతిలేదు.

ఒక పండితుడు సుప్రసిద్ధ సూఫీ మహనీయుని మఠానికి వెళ్ళాడు. అక్కడ వ్యక్తులు బిగ్గరగా పారాయణం చేయటం వంటి మరికొన్ని మార్మిక వీధుల్లో నిమగ్నమై ఉండటం ఆ పండితుడు గమనించి, హదీస్లోని మాటలను ఇలా ఉటంకించాడు.

“ధర్మంలో లేని కొత్త విషయాలను ధర్మంలో చొప్పించరాదు. అలా చొప్పించటం తిరస్కార యోగ్యమైనది.” (సహీహ్బుఖారి - 2697)

మీరు అవలంబిస్తున్న ఈ సూఫీ మతాచరణలు ప్రవక్త మరియు ప్రవక్త సహచరులకాలంలో ఉండేవి కావు. కాబట్టి అవి ధర్మంలో లేని నూతన పోకడలుగా భావించబడతాయని పండితుడు అన్నాడు. దానికి సమాధానంగా మీరు చెప్పిన హదీసులో ధర్మంలో లేని విషయాలను చొప్పించటం (innovation)గా భావించడం జరిగిందే కానీ, ధర్మం కోసం కొత్త ఆవిష్కరణలు నిషేధించలేదని, తసవ్వుఫ్ (సూఫీజం)లోని అభ్యాసాలు మతంకోసం ఆవిష్కృతమైన స్వభావం కలిగి ఉంటాయని ఆ సూఫీ అన్నాడు.

ప్రస్తావించ హదీసుకు ఆ సూఫీ పెద్దమనిషి ఇచ్చిన వివరణ అజ్ఞానంతో కూడుకున్నది. హదీసులోని పదాలను గమనిస్తే అటువంటి అర్థం ఏదిరాదు. హదీసులో ''ఇందులో లేనిది'' అనే పదం వచ్చింది. అంటే ప్రవక్త వారు ఏ ధర్మాన్ని అయితే వదిలి వెళ్లారో అందులో లేనిది అని అర్థం.

ఇందులో అసలు సమస్య ''లో, యొక్క'' వంటి వ్యాకరణాంశాలు అయిన విభక్తుల (prepositions) గురించి కాదు. ప్రవక్త ద్వారా ఏ దర్మం అయితే మనకు అందిందో దానిలో ఇప్పుడు నూతనంగా చేస్తున్న ఈ ఆచరణ ముందు నుండి ఉందా లేదా అనేది అసలు సమస్య. బిగ్గరగా స్మరించే ఈ ఆచరణ ప్రవక్త వదిలి వెళ్లిన ధర్మంలో లేదన్నది సుస్పష్టం. మరి ధర్మంలో లేని విషయం గురించి ''లో, కోసం, యొక్క'' వంటి వ్యాకరణాంశాలైన విభక్తుల ద్వారా ధర్మంలో చొప్పించే ప్రయత్నం చేయటం కొత్త పోకడలకు బీజం వేసే దుస్సాహసం అవుతుంది. ఏ విభక్తులూ ధర్మంలో లేని విషయాలను చొప్పించడానికి ఆమోదయోగ్యమైనది కావు.

ధార్మిక పండితులు మతపరమైన ఆరాధనలలో వ్యక్తిగత అభిప్రాయాలు ఉండకూడదు అనే విషయంపై ఏకాభిప్రాయం కలిగి ఉన్నారు. మరోమాటలో చెప్పాలంటే ఆరాధనల వ్యవహారంలో అనుకరణకు తప్ప, ధార్మిక అన్వయం (ఇజ్తెహాద్)కు అవకాశం లేదు. ఆరాధనల విషయంలో కేవలం స్పష్టంగా ఉన్న వాక్యాలనే తర్కముగా స్వీకరించబడుతాయి తప్ప, ఏవో పదాలను ఆధారంగా

చేసుకొని తర్కించడం జరగదు. పదాల ఆధారంగా ధార్మిక అన్వయం చేయటం జ్ఞాన పరంగా అశాస్త్రీయమైనది, ధార్మికంగా ఆమోదయోగ్యం కానిది.

## 10. అనునిత్యం ఆత్మశుద్ధి

ఆత్మశుద్ధి అనేది తాత్కాలిక శిక్షణ అని సాధారణంగా ఒక దురభిప్రాయం ఉంది. దానిని సాధించటానికి కొన్ని నిర్దిష్ట పదాలు లేదా పద బంధాలను నిర్ణీత సమయాల్లో పాటించవలసి ఉంటుందని భావించబడుతుంది. ఇలా తూతూమంత్రంగా చేసే ఆత్మశుద్ధి అసహజమైనది. ఇటువంటి స్వల్పకాలిక పద్ధతులను ఆశ్రయించడం ద్వారా ఏమీ సాధించలేము.

వాస్తవం ఏమిటంటే ఏవిధంగానైతే మనిషి శ్వాస తీసుకుంటాడో, ఉచ్ఛ్వాసనిశ్వాసలు ఎలాగైతే ఒక నిర్ణీత సమయం లేదో ఆవిధంగానే ఆత్మశుద్ధి అనేది ఒక నిరంతర ప్రక్రియ. అనునిత్యం జరిగే ఆత్మశుద్ధి అసలైన ఆత్మశుద్ధి. ఉదాహరణకు ఒక ఫారసీ కవి రాసిన కవిత అనువాదం చూడండి.

నా నిరుపేద సమాధిపై దీపమూ లేదు ఓ పువ్వు లేదు అందుకోసమే నా సమాధిపై ఏ మినుగురూ తిరగదు ఏ కోయిల రాగం వినిపించదు ఈ కవిత మీకు గుర్తుకొస్తే ఈ కవి ఎంతపెద్ద ఏమరపాటుకు గురయ్యాడనే ఆలోచనలో మీరు నిమగ్నమవుతారు. అతను మరణించాక అతని సమాధిపై ఏ దీపమూ, పువ్వూ ఉండదని, కాబట్టి అక్కడ ఏ మినుగురూ కానీ, ఏ కోయిల కానీ రాదు అని అతను భావిస్తున్నాడు. కానీ అసలు విషయం ఏమిటంటే మనిషి మరణించాక వేరే లోకానికి చేరుకుంటాడు. అక్కడి అవసరాలు ఇహలోకం కంటే భిన్నమైనవి. అక్కడ విజయం సాధించాలంటే ప్రాపంచిక నైపుణ్యం (ability) కంటే భిన్నమైన నైపుణ్యం అవసరం. పైగా పరలోకంలో రెండో అవకాశం ఉండదు. పరలోకంలో కేవలం నేడు చేసుకున్న ఆచరణలో ప్రతిఫలం మాత్రమే ఉంటుంది. రెండోసారి ఆచరణల అవకాశం ఉండదు.

ఈ కవిత కేవలం కవి సమ్మేళనంలో ఒక ఐటమ్మాకావచ్చు. కానీ ఈ విధమైన పర్యాలోచన విధానం మనిషి జీవితం పట్ల ఒక భూకంపంగా పరిగణించగలదు. మనిషి మరణాంతరం సంభవించే మరో జీవితానికి పనికొచ్చే వ్యక్తిత్వాన్ని నిర్మించుకునే పనిలో నిమగ్నం అవుతాడు. ఆ వ్యక్తిత్వం మీ అతనికి పరలోకంలో విజయం సిద్ధింపచేస్తుంది. ఈ ఆలోచన రాగానే అతను తన మీద సంభవించబోయే స్థితిగతుల గురించి ఆలోచిస్తాడు. అంతే కానీ సమాధి మీద సంభవించే పరిస్థితుల గురించి కాదు.

## 11. తప్పు చేసిన తర్వాత ఆత్మపరిశీలన

ఆత్మపరిశీలన ఆత్మశుద్ధికు గొప్పమార్గం. ఆత్మ పరిశీలన ద్వారా మనిషి మేధస్సు జాగృతమవుతుంది. తన వ్యక్తిత్వంలో కుదుపు మొదలవుతుంది. అతనిలో స్వీయసంస్కరణ అనే ప్రోత్సాహకం (incentive) మేల్కొంటుంది. ఆ విధంగా ఆత్మపరిశీలన వ్యక్తిని మానసికంగా, ఆధ్యాత్మికంగా అభివృద్ధి పథంలో నడిపిస్తుంది.

ఉదాహరణకు ఒక వ్యక్తి మీ గురించి మీరు వినటానికి ఇష్టపడని మాట అన్నాడు అనుకోండి. మీ మనోభావాలు దెబ్బతిని మీరు ప్రతీకారం తీర్చుకునే తీరులో అతనికి జవాబిచ్చారు. ఆ తర్వాత మీలోలోనా పశ్చాత్తాపం (repentance) పుట్టింది. మీరు మీ తీరుపై పునరాలోచన జరిపారు. ఈ విధంగా నేను నాలో ప్రతికూల వ్యక్తిత్వం నిర్మించుకుంటూ ఉన్నానని, ఈ వ్యక్తిత్వం నాకు మరణాంతర జీవితంలో సర్వనాశనం చేసేదిగా పరిణమిస్తుందని, ఈ వ్యక్తిత్వం నన్ను స్వర్గంలో ప్రవేశించడానికి అనర్హునిగా చేస్తుందని మీకు అనిపించింది.

ఖురాన్ప్రకారం స్వర్గవాసులకల్చర్, పీస్ఫుల్కల్చర్ అని మీకు అనిపించింది. అక్కడ నివసించే వారు పరస్పరం తమ జీవితాల్లో శాంతి సామరస్యాలతో జీవించే నైపుణ్యం కలిగి ఉంటారు. ఇలాంటి పరిస్థితుల్లో ఒకవేళ నేను నాలో ఓరిమి (tolerance) లేని వ్యక్తిత్వాన్ని కలిగి ఉన్నాను అందులో స్నేహపూర్వక తీరు (friendly behaviour) లేని వ్యక్తిత్వం కలిగి ఉన్నాను. నాలాంటి వ్యక్తి స్వర్గప్రవేశానికి

అనర్హుడు. అతను శాశ్వత సంతోషాలకు శాశ్వత సాఫల్యానికి దూరమవుతాడు. ఈ ఆలోచన మీలో నిర్మాణాత్మక విస్ఫోటనంగా రుజువవుతుంది. మీకు మీరే పర్యవేక్షకులు అవుతారు. మీలో మీ సంస్కరణకై తీవ్రమైన ఉద్వేగం జనిస్తుంది. ఆత్మపరిశీలన చేసుకునే ఈ వ్యక్తిత్వమే ఆత్మశుద్ధికు అన్నిటికంటే సర్వోన్నతమార్గం. ఆత్మశుద్ధి నిరంతరం అంతర్గత ఆలోచన ద్వారానే లభిస్తుందే గాని బాహ్య కార్యకలాపాల వల్ల కాదు. ఆత్మశుద్ధి ఎలాంటి కార్యం అంటే అందులో వ్యక్తి స్వయంగా పరిశుద్ధుడు అవుతాడు. తనకు తానే విద్యార్థి, తనకు తానే గురవవుతాడు.

## 12. హృదయశుద్ధి - మేధశుద్ధి

ఆలెఇమ్రాన్సూరలోని చివరిరుకూని చదవండి. అందులో జ్ఞానులను తమ బుద్ధి వినియోగించి భూమ్యాకాశాల గురించి ఆలోచన చేయండని చెప్పడం జరిగింది. అందులో మీకు అల్లాహ్సూచనలు కానవస్తాయని, వాటి ద్వారా మీరు మీ దైవాన్ని గుర్తిస్తారని, తద్వారా మీకు దేవుని సృష్టి ప్రణాళికకు సంబంధించిన జ్ఞానం ఏర్పడతాదని, దీని ద్వారా మీరు స్వర్గనరకాలను కనుగొంటారని, ప్రవక్తకు ఉన్న ప్రాముఖ్యత ఏమిటో తెలుస్తుందని ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆత్మశుద్ధికి సంబంధించిన అన్ని విషయాలు ఆరుకూలో సృష్టిమీద యోచన చేయించి నిరూపించటం జరిగింది. మరోవిధంగా చెప్పాలంటే ఖురాన్లోని ఆత్మశుద్ధి మేధో ఆధారితమైనదే కానీ, మనో ఆధారితమైనది కాదు. ఈ వ్యవహారంలో "ఖల్బ్ (మనసు)" అనే పదం ఖురాన్మరియు హదీస్లో సాహిత్యపరమైన అర్థంలో వాడటం జరిగింది కానీ సైంటిఫిక్ అర్థంలో కాదు.

తరువాతి కాలం సూఫీల ప్రాపకంలో ముస్లింలలో హృదయాధార ఆత్మశుద్ధి భావన మొదలైంది. ఈ భావన ప్రకారం మానవ హృదయం సర్వ దైవిక వాస్తవాల నిధిగా భావించడం జరిగింది. ధ్యానం (meditation) ద్వారా ఆ నిధిని చేరుకోవచ్చు. తద్వారా ఇస్లాంలో దేన్నయితే ఆత్మశుద్ధి అనటం జరిగిందో దానిని అందుకోవచ్చని

భావించబడింది. కానీ ఈ హృదయాధార (heart - based) ఆత్మశుద్ధి అనే భావన ఖురాన్ద్వారా తీసుకోబడలేదు. ఇది నిజానికి చరిత్ర నుండి ఉద్భవించింది. హృదయ ఆధారిత ఆధ్యాత్మికత (spirituality) అనే ఈ భావన పురాతన కాలం నుండి వస్తుంది. 9:30 ప్రకారం ఇదొక ఆనవాయితీగా ప్రజలు భావించి దీన్ని ఇస్లాంలో చొప్పించారు.

ఇస్లాం కాంక్షించే ఆత్మశుద్ధిని తిరిగి మళ్ళీ మేధో ఆధారిత ఆత్మశుద్ధిగా పునరుజ్జీవింప చేసే జ్ఞాన పునాదులను నేటి ఆధునిక శాస్త్రీయ రంగం అందించింది. ఆధునిక ఆవిష్కరణ ద్వారా తేలిందేమిటంటే మానవ హృదయం కేవలం రక్తప్రసరణ (circulation of blood) చేసే ఒక పంపు (pump)గా మాత్రమే పనిచేస్తుంది. దీనిలో ఆలోచనలు కలిగించే సామర్థ్యం లేదు. ఈ ఆలోచించే సామర్థ్యం పూర్తిగా మెదడుకే ఉంది. మనిషి తన జీవితంలో చేసే అన్ని పనులు కేవలం ఆలోచనల ద్వారానే ఉనికిలోకి వస్తాయి. ఆత్మశుద్ధి వ్యవహారం అందుకు మినహాయింపు కాదు. ఆత్మ శుద్ధి కూడా మేధోమదనం ద్వారానే లభిస్తుందే గాని, హృదయంపై కాల్పనిక దృష్టిపెట్టడం ద్వారా కాదు. ఇలా చేయటం ఆత్మశుద్ధి సముపార్జన కోసం వేళ్లపై, వెంట్రుకలపై దృష్టి సారించినంత నిరాధారమైనది.

## 13. మార్గదర్శకుని అవసరం

ఆత్మశుద్ధికి సైద్ధాంతిక మూలం ఖురాన్ అధ్యయనం చేయటం, హదీసులు చదవటం, ప్రవక్త సహచరుల జీవితాల నుండి మార్గదర్శకత్వం పొందటం. ఈ మూలాల ప్రాముఖ్యత శాశ్వతంగా ఉంటుంది. దీనితో పాటు ఆత్మశుద్ధిని పొందటం కోసం ఒక ఆచరణాత్మకమైన షరతు ఉంది. అది సమకాలీన ఒక మార్గదర్శి లేదా గురువుని వెతికి అతని జ్ఞానం నుండి, అనుభవాల నుండి ప్రయోజనం పొందడం. ఎవరికైనా ఒక గురువు దొరికినప్పుడు అతను బేషరుతుగా అతని శిష్యరికంలోకి వెళ్ళాలి. గురువు శిష్యుడుకంలోకి షరతులు ఆధారంగా వెళ్ళటం ఆత్మశుద్ధి మార్గంలో పెద్ద ఆటంకంగా తయారవుతుంది.

ఒక వ్యక్తిని బేషరతుగా గురువని భావించటం ముమ్మాటికీ అంధానుసరణ కాదు. సచేతనంగా ఇద్దరు వ్యక్తుల తరంగ దైర్ఘ్యం (wave length) ఒకటవ్వటం ఇద్దరు వ్యక్తుల మేధో పరమైన ఉమ్మడి దృష్టికోణం కలిగి ఉండటమనే అర్థమేగానీ ముమ్మాటికి అంధానుసరణ కాదు.

ఏ వ్యవహారంలోనైనా సత్యమనేది ఎల్లప్పుడు ఒకే విధంగా ఉంటుంది. కాబట్టి ఇద్దరు వ్యక్తులు అసలు వాస్తవికతకు చేరుకున్నాక, సహజంగా వారిమధ్యన మేధోపరమైన ఉమ్మడి తనం జనిస్తుంది. వారిరువురూ ఒకరికొకరు ఆలోచనల రీత్యా కవలలుగా (intellectual twin) అవుతారు.

ఆత్మశుద్ధి కోసం గురువు లేదా మార్గదర్శి కచ్చితంగా ఉండాలి. కానీ గురువు ప్రాముఖ్యత ఆచరణపరమైనది కాదు, సిద్ధాంతపరమైనది. గురువుని కలిగి ఉండటం సర్వసామాన్యంగా అల్లాహ్పెట్టిన సాంప్రదాయం. ఈ సంప్రదాయం గురించి ''సూరేజుఖ్రుఫ్'' లోని వాక్యాలలో ఈ విధంగా ప్రస్తావించడం జరిగింది.

వారిలో కొందరికి మరికొందరిపై అంతస్తుల వారీగా ఆధిక్యం ఇచ్చాము, వారు ఒకరి నొకరు సేవించుకోవటానికి. 43:32

నాయకత్వపు లక్షణాలు ప్రతివ్యక్తికి ప్రసాదించి పుట్టించడం దేవుని సంప్రదాయం కాదని ఈ వాక్యం ద్వారా తెలుస్తోంది. ఒక వ్యక్తిని నాయకునిగా చేయటం, మిగతావారు అతన్ని అనుసరించడమే దేవుని సంప్రదాయం. దేవుని సాంప్రదాయం ప్రకారం ఇదే సహజ జీవన విధానం.

ధార్మిక గురువుల వ్యవహారం కూడా ఇదే విధంగా అల్లాహ్సంప్రదాయంతో ముడిపడి ఉంది. అల్లాహ్తన ప్రత్యేక సహాయం ద్వారా ఎవరో ఒకరిని మత గురువుల స్థానంలో నిలబెడతాడు. వారిని గుర్తించి వారి ద్వారా ప్రయోజనం పొందుతూ ఆత్మశుద్ధి చేసుకోవటం మిగతా వారి విధి. ఎవరైతే ఈ విధంగా చేయరో వారు స్వాభావిక పరీక్షలో విఫలం అవుతారు.

మతగురువు అంటే మాయ పూరితమైన ప్రభావం చేసేవాడు కాదు. ఇది ఒక సాధారణమైన జ్ఞాన పరమైన వ్యవహారం. నిశిత పరిశీలన ద్వారా దీనిని అర్థం

చేసుకోవచ్చు. మత గురువు ద్వారా లభించేది మాయా పూరిత మహిమ కాదు, అతని ద్వారా లభించేది సర్వసాధారణంగా శిక్షణ ద్వారా చేకూరే ప్రయోజనమే. సజీవమైన మార్గదర్శే మత గురువు అవ్వగలడు, అతీంద్రియ శక్తులు కలిగిన మాంత్రికుడు కాదు.

## 14. ఆత్మశుద్ధి కోసం సాంగత్యం తప్పనిసరి.

సాహచర్యం అనేది ఆత్మశుద్ధికి ఒక గొప్పసాధనం. పురాతన కాలంలో ప్రత్యక్షంగా సమావేశం అవ్వడమే సహచర్యానికి మూలం. ప్రస్తుత కాలాన్ని సమాచార (communication) యుగం అని చెప్పవచ్చు. ఈ రోజుల్లో ఒక వ్యక్తి సుదూరాలలో ఉండి కూడా తన గురువు లేదా బోధకుడితో సహచర్యం చేసి ప్రయోజనం పొందడం సాధ్యమవుతుంది.

ఈ సహచర్యాన్ని ఉత్తరప్రత్యుత్తరాలు ఇంటర్నెట్టెలిఫోన్మొదలగునవి మూల సాధకాలు. టెలికౌన్సిలింగ్ (tele counseling) కూడా మరొక సాధనం. ఏ వ్యక్తి అయినా వాస్తవంగా ఆత్మశుద్ధి కాంక్షించినట్లయితే ఈ సాధకాలన్నీ అతని సహచర్యాన్నికి ప్రత్యామ్నాయాలుగా ఉపయోగపడతాయి.

ఈ ఆధునిక సాధనాల్లో ప్రింటింగ్రెస్కూడా ఒక సాధనం. ప్రింటింగ్రెస్ద్వారా నెలవారి మాసపత్రికల రూపంలో నిరంతరం ఆత్మశుద్ధికి అనువైన మెటీరియల్పొందడం సాధ్యమయ్యింది. ఈ అంశంపై ప్రచురించబడిన పుస్తకాలను పదేపదే చదవండి. ఈ విధానం ఆవశ్యకతను ఈ క్రింది విధంగా ఖురాన్తెలుపుతుంది.

ఆయన కలం ద్వారా జ్ఞానబోధ చేసాడు (96:4)

అనగా కలంతో రాసిన పుస్తకాల నుండి దైవ ధర్మాన్ని తీసుకోవాలి. అధ్యయనం ప్రాముఖ్యత ఒకకోణంలో సహచర్యం కంటే కూడా అధికమైనది. సహచర్యంలో వ్యక్తి ఏదైనా నా మాటను తన గురువు ద్వారా ఒకసారి వింటాడు. అదే పుస్తకం నుండి అయితే ఒకే విషయాన్ని అనేకసార్లు చదవచ్చు. దానిని ఎదురుగా

ఉంచుకొని పదేపదే యోచన చేయవచ్చు. దాని గురించి ఇతరులతో చర్చలు చేయవచ్చు. ఇదికేవలం పుస్తకాల ద్వారా లభించే ప్రయోజనం.

ఆత్మశుద్ధి కోసం సహచర్యం అత్యంత ఆవశ్యకం. గురువు ద్వారా నిరంతరం ప్రయోజనం పొందుతూ ఉండాలి. మీరు మీ సమస్యలను ప్రత్యక్షంగానైనా లేదా ఆధునిక మాధ్యమాల ద్వారా అయినా మత గురువుతో చెప్పుకొని మార్గదర్శకత్వాన్ని పొందండి. సత్సంగం నిరంతరం ఆవశ్యకం. తాత్కాలిక సహచర్యం ద్వారా ఆత్మశుద్ధి ప్రయోజనం లభించదు.

## 15. మధ్యవర్తిత్వం లేకుండా

తెలిసో తెలియకో జనాలు ఆత్మశుద్ధి కోసం ఒక అతీంద్రియ ప్రభావం లేదా మధ్యవర్తిత్వం అవసరం అనే అపోహలో ఉన్నారు. తమ పూర్వీకుల పెద్దల గురువుల జ్ఞానుల మొదలగు సిద్ధుల మధ్యవర్తిత్వం అవసరమని వారు అనుకుంటున్నారు. వాస్తవానికి మార్గదర్శకం అనే విషయంలో దేవుడే అసలు లక్ష్యం. అలాంటిది మధ్యవర్తిత్వానికి సంబంధించిన అభౌతిక భావన కారణంగా గురువే అంతిమ గమ్యమై కూర్చున్నాడు. మధ్యవర్తిత్వం అనే ఈ భావనకు ఏపునాది లేదు. ఆత్మశుద్ధి అనేది ప్రత్యక్షంగా దేవునితో ఉన్న సంబంధం ద్వారా ఏర్పడుతుంది. ఈ వ్యవహారంలో మరే మధ్యవర్తిత్వం అక్కర లేదు.

వాస్తవ ఆత్మశుద్ధి ఎల్లవేళలా సహాయంతోనే లభిస్తుంది. అల్లాహ్సహాయం కోసం మరేమధ్యవర్తిత్వం అవసరం లేదు. అల్లాహ్సహాయం ప్రతిదాసునికి నేరుగా లభిస్తుంది. వాస్తవ రీతిలో ఆత్మశుద్ధి పొందాలన్న అభిలాష ఉండటమే దీని షరతు కురాన్లోని సూరెబఖరాలో ఈ విధంగా తెలియజేయబడింది.

నా దాసులు నా గురించి నిన్ను అడిగితే నేను వారికి అత్యంత సమీపంలో ఉన్నానని, పిలిచేవాడు నన్ను ఎప్పుడు పిలిచి నా నేను అతని పిలుపును ఆలకించి ఆమోదిస్తానని నువ్వు వారికి చెప్పు. కాబట్టి వారు కూడా నా ఆదేశాన్ని శిరసా

వహించాలని, నన్ను విశ్వసించాలని తద్వారానే వారు సన్మార్గ భాగ్యం పొందుతారు. (2:186)

ఖురాన్లోని ఈ వాక్యంలో సమీపం (ఖరీబ్) అనే పదం వాడటం జరిగింది. దీని ద్వారా ఆత్మశుద్ధి మార్గం దైవసామీప్యాన్ని పొందడంలోనే ఉందేగాని మధ్యవర్తిత్వం ద్వారా కాదు. ఆత్మ ఆత్మశుద్ధి కాంక్షించే వ్యక్తి తన మేధస్సును మేల్కొలిపి వీలయినంత అధికంగా దైవ సామీప్యాన్ని పొందే ప్రయత్నం చేయాలి.

ఈ లక్ష్యాన్ని సాధించడంలో ఏ మధ్యవర్తిత్వం సహాయపడదు. ఆత్మశుద్ధి ప్రత్యక్షంగా అల్లాహ్తో ఉన్న సంబంధం ద్వారానే లభిస్తుంది. లేదా బొత్తిగా లభించదు. వాస్తవం ఏమిటంటే, మధ్యవర్తిత్వం అనే భావన ఆత్మశుద్ధి మార్గంలో ఒక అడ్డంకి. దైవమే మనిషి ప్రాణనాళం కంటే దగ్గరగా (50:16) ఉన్నప్పుడు వేరే మధ్యవర్తిత్వం అవసరం ఏమొచ్చింది? ఈ మధ్యవర్తిత్వ భావన అభౌతిక ప్రభావంతో ముడిపడ్డ విశ్వాసం మీద ఆధారపడి ఉంది. అయితే, మార్గదర్శి లేదా మతగురువు అనే భావన సచేతన సంబంధంతో ఏర్పడుతుంది.

## 16. ఆత్మశుద్ధికి ముందు

ఆత్మశుద్ధి నిజమైన ప్రేరణ నిస్సహాయ (destitution) స్థితి. ఒక వ్యక్తి తన అసహాయతను ఎంత ఎక్కువగా తెలుసుకుంటాడు అతను అంత ఎక్కువగా ఆత్మశుద్ధి ఆకర్షితుడవుతాడు. ఇటువంటి వ్యక్తి సహజంగానే తన అసహాయత పరిపూర్తి చేసుకోవడం కోసం వెంపర్లాడుతాడు. వెంపర్లాటపేరే ఆత్మశుద్ధి.

ఈ వెతుకులాట అనేది స్వయంగా తన అస్తిత్వం నుంచి మొదలవుతుంది. అన్నిటికంటే ముందు మనిషి తన ఉనికి గురించి కనుగొంటాడు. దీని ద్వారా నాకు ఈ ఉనికి (existence)ని ప్రసాదించినవాడు ఎవడు అనే ఉత్సుకత (curiosity) మనిషిలో జనిస్తుంది. ఈ విధంగా అతను తన సృష్టికర్తను కనుగొంటాడు. దీని ఫలితంగా అతనిలో తన సృష్టికర్త గొప్పతనం గురించి అద్భుతమైన అనుభూతి

కలుగుతుంది.

తను పూర్తిగా పరాధీనుడిని అనే భావన అతనిలో జనిస్తుంది. నేను నా బలంతో ఏ అవసరాన్ని పరిపూర్తి చేసుకోలేను. ఇప్పటికీ అవసరానికి పనికివచ్చే అన్ని వస్తువులు ముందునుంచే సిద్ధపరచి ఉన్నాయి. భూమి, నీరు, ప్రాణవాయువు, వెలుతురు, ఆహారం ఇంకా అనేకమైన ఇతరవస్తువులను జీవిత మద్దతు వ్యవస్థ (life support system) అంటారు. అవన్నీ నాకోసం బేషరతుగా ప్రసాదించిన బహుమతులు. ఈ వరప్రసాదాలు అన్నీ ప్రసాదించిన దాత గవరని తెలుసుకునే ప్రయత్నం చేస్తాడు. ఆవిధంగా తను తన యజమానిని కనుగొంటాడు. దీని ఫలితంగా అతనిలో తన ప్రభువుపట్ల హద్దుల్లేని ప్రేమ జనిస్తుంది.

ఈ విధంగా మొదలైన అన్వేషణ మనిషికి తన అంతిమలక్ష్యం (goal) ఏమిటి అనే ప్రశ్నవరకూ చేరవేస్తుంది.  తాను కోరుకుంటున్న లక్ష్యంచేరుకోవటం ఈ ప్రపంచిక జీవితంలో కుదరదు అనే విషయం తెలుసుకుంటాడు. తత్ఫలితంగా అతను స్వర్గకాంక్షిగా మారిపోతాడు. అక్కడ అతను తన లక్ష్యాన్ని పొందుతాడు, తన అన్ని అవసరాలను పూర్తి చేసుకుంటాడు.

ఈ విధంగా మనిషి ఎప్పుడైతే ఆలోచిస్తాడు అప్పుడు అతను తనకు ప్రామాణిక మార్గదర్శకపు ఆవశ్యకత ఉందనే విషయాన్ని గ్రహిస్తాడు. మళ్లీ అతను అన్నివిధాలా శోధనలు చేసినప్పటికీ తనంతట తాను ప్రామాణిక మార్గదర్శకత్వాన్ని కనుగొనలేదు. తత్ఫలితంగా అతనిలోని ద్విగుణీకృతమవుతుంది. అది మార్గదర్శకత్వానికి ఏకైక మార్గం దైవప్రవక్త (prophet) అనే వాస్తవాన్ని గ్రహించేలా చేస్తుంది. ఆవిధంగా అతను తన పూర్ణ హృదయముతో ప్రవక్తను తన మార్గదర్శిగా స్వీకరిస్తాడు.

ఈ అన్వేషణలో అనంతరం అతనిలో నమ్రత (modesty) స్వభావం జనిస్తుంది. అతను సృష్టికర్త మహిమలో జీవించటం ప్రారంభిస్తాడు. దైవసృష్టి వ్యవస్థ అతన్ని నిరంతరం దైవస్మరణలో నిమగ్నమయ్యేలా చేస్తుంది. స్వర్గప్రాప్తి అతని ప్రధానలక్ష్యం అవుతుంది. దైవప్రవక్త అతని పరిపూర్ణ మార్గదర్శి అవుతాడు. ఈ

మార్మిక అనుభూతుల సంగ్రహమే మనోప్రక్షాళన.

## 17. ఆత్మ శుద్ధి - ఆత్మపరిశీలన

ఆత్మశుద్ధి అనేది ఏదో ఒకసారి జరిగే ప్రక్రియ కాదు. అంటే, ఎవరైనా వ్యక్తి ఏదో ఒక కోర్సు చేసినంత మాత్రాన అతను శాశ్వతంగా పరిశుద్ధుడు అవ్వడు. వాస్తవం ఏమిటంటే ఆత్మశుద్ధి ఒక నిరంతర ప్రక్రియ. ఇది జీవితాంతం కొనసాగుతూనే ఉంటుంది. ఈ ప్రక్రియ మరణంకంటే ముందు పరిపూర్తి అవ్వదు.

ఆత్మశుద్ధి ఆత్మపరిశీలన కార్యం. ఇందులో మనిషి తనకు తానే పర్యవేక్షకుడు అవ్వాల్సి ఉంటుంది. ఆత్మ శుద్ధి ఆకాంక్షిస్తున్న వ్యక్తి ఎల్లవేళలా తన మాటల మీద, చేతల మీద నిఘాపెట్టాలి. చాలా నిష్పక్షపాతంగా మాటిమాటికి తననితాను సమీక్షించుకుంటూ ఉండాలి. తీసులక్షణం కేవలం పశ్చాత్తాపపడి వారిలో ఆత్మపరిశీలన చేసుకునే వారిలో కానవస్తుంది.

ఇది పరీక్ష ప్రపంచం. ఇక్కడ అనునిత్యం మానవుడు విచారణకు గురవుతూనే ఉండే విధంగా సృష్టికర్త ఈ ప్రపంచాన్ని నిర్మించాడు. ప్రతిసారి మనిషి మనోకాంక్షలకు ప్రభావితమవడం, సైతాన్దుష్టప్రేరణలు అతనిని అనవసరపు వ్యవహారాలలో నిమగ్నపరచడం, పరిసరాల ప్రభావంచేత చెడు విషయాలకు బలవ్వడం మొదలగు విషయాలు ఆత్మశుద్ధికి ప్రతిబంధకాలు.

మనిషి ఎంతో జాగురుకతతో ప్రతిక్షణం తనకు తాను శుద్ధిపరచుకునేంత సున్నితత్వం కలిగి ఉండాలి. హృదయం కలుషితమైన ప్రతిసారి దానిని శుభ్రపరుచుకోవాలి. ఇదే మనోప్రక్షాళన. ఇటువంటి ఆత్మపరిశీలన లేనిదే ఏవ్యక్తి కూడా పరిశుద్ధ వ్యక్తిత్వస్థాయిని పొందలేడు. ఆత్మపరిశీలన ద్వారా మేధోవికాసం జరుగుతుంది. ఆత్మశుద్ధి ప్రక్రియ నిరంతరాయంగా జరగటానికి మేధోవికాసం హామీదారు అని చెప్పవచ్చు.

## 18. ఆత్మ శుద్ధి - వినమ్రత

పంటకోసం అనువైన నేల అవసరం. పంట ఎల్లవేళలా సారవంతమైన నేలమీదే పడుతుంది. బంజరు భూమిపై పంట ఎప్పుడూ పండదు. వినమ్రత (modesty) ఆత్మప్రక్షాళనకు అనువైన నేలవంటిది. వినమ్రుడైన వ్యక్తి ఆత్మశుద్ధి పొందటం సులువవుతుంది. అహంకారం (arrogance) ప్రక్షాళనకు అనువైన నేలకాదు. అహంకారి ఎన్నటికీ ఆత్మశుద్ధి స్థాయికి చేరుకోలేడు.

దీనికి కారణం వినయం (modesty) అనేది మనిషిలో నిరాడంబరతను కలిగిస్తుంది. నిరాడంబరమైన వ్యక్తి నాలో లేనిది మరొకటేదో నేను పొందాలనే మనస్తత్వం కలిగి ఉంటాడు. దీనిఫలితంగా ఆ వ్యక్తికి సత్యం తారసపడినప్పుడు అతను ఏ మానసిక నిర్బంధం (reservation) లేకుండా దానివైపు పరుగులు తీస్తాడు. అతను నిష్పక్షపాతంగా తన గురించి సమీక్ష చేసుకుంటాడు. తనలోని లోపానికి సత్యమే పరిపూర్తి అన్న విషయాన్ని అతను గ్రహిస్తాడు. సత్యాన్ని తన సొంత ఆస్తిగా భావించి స్వీకరిస్తాడు. ఈ సుగుణం ఆత్మశుద్ధికి జీవం వంటిది.

అహంకారి వ్యవహారం దీనికి పూర్తిగా భిన్నమైనది. అహంకారి తన వద్ద ముందు నుండే అన్నిసదుపాయాలు ఉన్నాయి అన్న మనస్తత్వాన్ని కలిగి ఉంటాడు. ఈ మనస్తత్వం కారణంగా అతను ఏ బాహ్య వస్తువుని స్వీకరించడానికి సిద్ధంగా ఉండడు. సంస్కర్త చెప్పే మాటలను అతను సులువుగా వ్యతిరేకిస్తాడు. ఈ మనస్తత్వమే అతని ఆత్మశుద్ధి మార్గంలో అవరోధమవుతుంది.

వాస్తవానికి ఆత్మశుద్ధి నిరంతర ప్రక్రియ. వినయం కలిగిన వ్యక్తిలోనే ఈ ఆత్మశుద్ధి ప్రక్రియ జరుగుతుంది. వినయ గుణం మనిషిలో అంగీకరించే మనస్తత్వాన్ని పుట్టిస్తుంది. వినమ్రుడైన వ్యక్తి మానసిక సంక్లిష్టత (complex)లను నుండి స్వతంత్రుడై ఆత్మశుద్ధి స్థాయికి చేరుకోవడంలో విజయం సాధిస్తాడు.

## 19. పవక్త సాంప్రదాయిక ప్రార్థనలు

దైవప్రవక్త మొహమ్మద్ద్విభిన్న సందర్భాలలో కొన్ని వచనాలను వల్లించే వారిని హదీసు పుస్తకాలలో ఉల్లేఖించబడింది. వాటినే జిక్ర్ (స్మరణ), దుఆ (ప్రార్థన) వచనాలుగా చెప్పటం జరిగింది. ఆ వచనాలే సాధారణంగా ప్రవక్త సాంప్రదాయిక స్మరణలు లేదా వేడుకోలు అని ప్రసిద్ధి చెందాయి. ఈ సాంప్రదాయిక స్మరణలు ప్రక్షాళనకు రాజమార్గాలనే అపోహ సర్వసాధారణమైపోయింది. అంతేకాక ఆ స్మరణలు కంఠస్థం చేసుకోవడం, కొన్ని సందర్భాలలో వల్లించటమే ప్రక్షాళననే భావన ఉంది. ఇది చాలా లోపభూయిష్టమైన భావన.

ప్రవక్త సాంప్రదాయిక స్మరణలు కేవలం పరిశుద్ధ పదాల వల్లింపు కాదు. వాస్తవానికి అవి ప్రవక్త మానసిక స్థితికి ప్రతిబింబాలు. అసలు వాస్తవమేమిటంటే ప్రవక్త మొహమ్మద్దమ ఉన్నతస్థాయి సాక్షాత్కారాల (మారిఫత్) కారణంగా నిరంతరం దైవిక ఆలోచనలలో నిమగ్నమయ్యేవారు. ఈ అంతరంగిక అనుభూతి గురించి విభిన్న సందర్భాల్లో తన నోటి ద్వారా వెలువడేది.

నేడు హదీసు పుస్తకాలను చదివేవారు కేవలం ప్రవక్త పదాలను మాత్రమే గ్రహిస్తున్నారు. వారు ప్రవక్త అంతరంగస్థితిని గ్రహించట్లేదు. ప్రవక్త అంతర్గత స్థితి పుస్తకాలలో నమోదు అవ్వలేదు కాబట్టి, వారు నమోదైన వచనాలే సర్వస్వం అనుకుంటున్నారు. జిక్ర్లేదాస్మరణ గురించి ఇలాంటి భావన కలిగిఉండటం దానిని చులకనగా చూడటమే అవుతుంది.

వాస్తవమేమిటంటే సాంప్రదాయక స్మరణ చేయటం అంటే, మనిషి తన వివేకాన్ని మేల్కొలుపు కోవటమే. నిరంతర యోచన ద్వారా మనిషి దైవికస్థితిలో జీవించే వ్యక్తిత్వాన్ని తనలో నిర్మించుకోవాలి. ఇదంతా జిక్ర్ (స్మరణ) కంటే ముందుగా జరగాల్సిన సున్నత్ (సాంప్రదాయం). మనిషి జిక్ర్కంటే ముందు తనలో సున్నత్ను జీవింపచేయాలి. మనిషిలో సున్నత్జీవించిన తర్వాత అతని నోటి నుండి వెలువడే

వాక్యాలేజికర్ (సంప్రదాయిక స్మరణ) లేదా దుఆ (సాంప్రదాయిక వేడుకోలు)లు అవుతాయి. ఈ విధమైనటువంటి దైవిక వ్యక్తిత్వం తయారవ్వనంత వరకూ మనిషి చేసే స్మరణలు కేవలం పదాలను వల్లించడమే అవుతుంది గాని, మస్నూన్ అజ్కార్ (సాంప్రదాయిక స్మరణలు) కాజాలవు.

తెలిసోతెలియకో జనాలు, స్మరణకు సంబంధించిన కొన్ని పవిత్ర పదాలు ఉన్నాయనీ, వాటిలో ఏదో ఒక అభౌతిక ప్రభావం దాగుందనే అపోహలో ఉంటారు. కానీ ఈ భావన సరైనది కాదు. వాస్తవం ఏమిటంటే ఈ సాంప్రదాయిక స్మరణలు ప్రవక్త అంతర్గత స్థితులకు ప్రతిబింబాలు. అంతేగాని అవి కేవలం మస్నూన్అల్ఫాజ్ (సాంప్రదాయిక వాక్యాలు) కాజాలవు.

## 20. ఆత్మ శుద్ధి - వేడుకోలు

తన నిస్సహాయత గురించి, దేవుని ఔన్నత్యాన్ని గురించి క్షుణ్ణంగా అవగతమైన వ్యక్తి మనోగతానికి అక్షరరూపమే దుఆ (వేడుకోలు). మస్నూన్దు ఆ (ప్రవక్త సాంప్రదాయిక వేడుకోలు) వ్యవహారం కూడా దీనికి మినహాయింపు కాదు. సాంప్రదాయిక వేడుకోలు అంటే, సామాన్య అర్థంలో ప్రవక్త సాంప్రదాయిక వేడుకోలులోని పదాలు (మస్నూన్ అల్ఫాజె దుఆ) ముమ్మాటికి కాదు. దేవుడిని అతని గుణగణాలసమేతంగా అర్థం చేసుకోవటమే ప్రవక్త సాంప్రదాయిక వేడుకోలు వాస్తవికత. ఒక దైవిక అనుభూతి జరిగినపుడు స్వయ అన్వేషణ యొక్క పద నిర్వచనమే సాంప్రదాయిక వేడుకోలు (మస్నూన్ దుఆ) లేదా స్వీయ అన్వేషణ వేడుకోలు అనబడుతుంది.

ఒక హదీసె ఖుద్సీ 1లో ఇలా చెప్పబడింది.

నేను నా దాసుడి ఊహకు అనుగుణంగా ఉన్నాను. కాబట్టి అతను నా నుంచి మేలునే ఊహించాలి. (అలై?సరానీ 5/2793)

మేలును ఊహించటం అంటే దేవుని గుణాలలో నుండి ఏదేని ఒక దైవిక లక్షణాన్నీ కనుగొనడమే. తద్వారా అతనికి దేవుని గురించి సదుద్దేశం కలిగి అతను దేవుని నుండి మేలును కాంక్షించే అవకాశం లభిస్తుంది.

ఉదాహరణకి ఖురాన్లో ఈ విధంగా చెప్పబడింది.

మరి ఆయనే మీరు అడిగిన దానినల్లా మీకు ఇచ్చి ఉన్నాడు (14:34)

ఈ వాక్యము ఒక దాసుడు తన వెదుకోలుకు ఒక పాయింట్ ఆఫ్ రిఫెరన్స్ సూచిస్తుంది. దానిలో అతను దేవుని కారుణ్యాన్ని ఇన్వోక్ (%ఙఅజఱశీఎవ%) చేయగలడు. అదేమిటంటే, ఓదేవా! నేను అర్థించకుండానే ఇహలోక జీవితంలో కావాల్సిన అన్ని అవసరాలు తీర్చావు. కనీసం ఏవేవి అవసరమో వాటి అవగాహన కూడా నాకు లేదు. నా ప్రాపంచిక జీవితంలో ఆవశ్యకమైన ప్రతి అవసరాన్ని తీర్చే ఏర్పాటు చేశావు. పరలోక విషయమై నేను నిన్ను పదే పదే వేడుకుంటున్నాను. నువ్వు నా వేడుకోలును తప్పనిసరిగా మన్నించి పరలోకంలో కూడా నా అన్ని అవసరాలను తీర్చు.

(1. హదీస్ ఎ ఖుద్సీ లో దేవుడు తన దాసునికి విషయాన్ని ప్రత్యక్షంగా తెలియజేస్తాడు)

ఒక వ్యక్తిలో తీవ్రమైన మానసిక అలజడి కలిగిన తర్వాత అతని నోటి వెంట ఈ విధమైన వేడుకోలు వెలువడుతుంది. ఈ మానసిక సంఘటనకు మరోపేరే మనోప్రక్షాళన. ఆత్మశుద్ధి మరియు వేడుకలు పరస్పరం తప్పనిసరి అని వార్యాలు. ఎక్కడైతే ఆత్మశుద్ధి జరుగుతుందో అక్కడ వేడుకోలు కూడా తప్పనిసరిగా వ్యక్తమవుతుంది. ఎప్పుడైతే వేడుకోలు వ్యక్తం అవుతుందో, అది అంతకుమునుపే వ్యక్తిలో ఆత్మశుద్ధి జరిగింది అనటానికి నిరూపణ. ఆత్మశుద్ధి లేనిదే వేడ్కోలు లేదు, వేడుకోలు లేనిదే ఆత్మశుద్ధి లేదు.

## 21. ఆత్మ శుద్ధి బాహ్యరూపం

ప్రక్షాళనకు ఏ బాహ్యరూపము లేదు. దీనికి ఏదైనా బాహ్యరూపం ఉంటే మనిషి తెలుసోతెలియకో నేను నా ఆత్మశుద్ధి చేసుకున్నాను అనుకునేవాడు. ఆ విధంగా అతనిలో సంతృప్త స్వభావం (contentment) జనిస్తుంది. సంతృప్త భావన ప్రక్షాళనకు మరణం వంటిది. ఆత్మశుద్ధి కోసం మనిషిలో అనునిత్యం అసంతృప్త భావన (discontent) అవసరం. ఈ అసంతృప్త భావన ఆత్మశుద్ధి ప్రక్రియను నిరంతరాయంగా కొనసాగటానికి దోహదపడుతుంది. సంతృప్తభావన ఆత్మశుద్ధి ప్రేరణలను అంతం చేస్తుంది.

ప్రక్షాళనకు ఆరాధనల నిర్ణీత వ్యవస్థతో లోతైన సంబంధం ఉంది. ఆత్మ శుద్ధి మరియు ఇస్లామీయ ఆరాధనలు పరస్పరం అనివార్యాలు. రెండిటినీ వేరుపరచటం జరగదు. ఏ వ్యక్తైనా తన ఆత్మశుద్ధి పూర్తయిందని, తనకింకా వేరే ఆరాధనలతో అవసరంలేదని అనలేడు.

పైకి ఆరాధనలు చేసినంత మాత్రాన ఆత్మశుద్ధి పూర్తైనట్లు కాదు. అలా అనుకోవడం అసహజ విషయం. వాస్తవం ఏమిటంటే ఆరాధనలు ప్రక్షాళనకు బాహ్యస్వరూపం వంటివి. వాటి వాస్తవ రూపంలో అవి ఆత్మశుద్ధి పొందేందుకు మాధ్యమాలైతే కావు. ఒకవేళ ఏ వ్యక్తిలోనైనా ప్రక్షాళనా ఆత్మజనించినట్లయితే ఇతను తప్పనిసరిగా దైవారాధనలో నిమగ్నమవుతాడు.

దైవారాధనను ప్రక్షాళనను వేరుచేయడం జరగదు. కాబట్టి ఆత్మశుద్ధి ఆత్మను పొందడం కోసమే పూర్తిబలాన్ని వినియోగించుకోవాలేగాని, బాహ్యస్వరూపంపై కాదు. ఆరాధన చేయకుండా ఆత్మశుద్ధి పొందానని దావాచేయుటం భూటకవాదన అవుతుంది. అయితే, ఆరాధనల బాహ్యరూపంతో ఆటోమేటిక్గా ఆత్మశుద్ధి ఆత్మ జనించదు అన్నది కూడా వాస్తవమే.

## 22. మనస్సాక్షి ప్రక్షాళనకు మార్గదర్శి

మనిషిలోపల సహజసిద్ధంగా ఒకగురువు (%ఝుఎబశ్రీఎ%) ఉన్నాడు. అతడినే మనస్సాక్షి (conscience) అని చెప్పటం జరిగింది. ఈ మనస్సాక్షి దైవిక గురువు. ఈ మనస్సాక్షి మనిషిలో ప్రక్షాళనకు మార్గదర్శి (guide)గా పనిచేస్తుంది. ఏదిచెయ్యాలి, ఏదిచెయ్యకూడదు అన్నవిషయం ఎల్లవేళలా మనస్సాక్షి మనిషికి మౌనంగానే తెలియజేస్తూ ఉంటుంది. మనస్సాక్షి, ప్రక్షాళనకు అనువైనదేదో, ప్రతికూలమైనదేదో చెబుతూ ఉంటుంది. ఏది శుద్ధమైనదో, ఏది అపరిశుద్ధమైనదో వంటి మొదలగునవి తెలుపుతుంది.

అనుభవంరీత్యా తెలిసిన విషయం ఏమిటంటే, అత్యధికులలో మనస్సాక్షి వారి ప్రక్షాలనకు మార్గదర్శిగా పనిచేయట్లేదు. దానికి కారణం, మనిషిలో మనస్సాక్షికి ప్రతికూలంగా పనిచేసే అహం (ego) అనే గురువు కూడా ఉన్నాడు. మనిషి అధికశాతం మనోకాంక్షలకు షైతాన్ప్రలోభాలకు లోనవుతాడు. ఈ అహం మనస్సాక్షి పనిని సజావుగా సాగదు. మనస్సాక్షి మౌనస్వరం ప్రతిసారి ఉబికివస్తుంది. కానీ అహం దాని గొంతునులిమి
ప్రభావితం చేస్తుంది.

ఆత్మశుద్ధి కాంక్షించే వ్యక్తి దానివాస్తవికతను ఎరిగి ఉండాలి. తన ఆలోచనా పటిమను నిద్రలేపాలి. అతను ప్రతిక్షణం తన అహాన్ని నియంత్రించుకోవాలి. అహం నియంత్రించబడితే మనస్సాక్షి తన పని తాను చేసుకుపోతుంది. ఆత్మశుద్ధి మార్గంలో తన ప్రయాణం నిర్విఘ్నంగా సాగుతాది.

అహాన్ని నియంత్రించటం అనేది ఈ వ్యవహారంలో నిర్ణయాత్మక భూమికి అవుతుంది. కానీ ఈ పని ఏ వ్యక్తి కూడా మరో వ్యక్తి కోసం చేయలేడు. తనలో అహంజాగృతమైన వెను వెంటనే అతను తన దృఢసంకల్పం (will power)ని వినియోగించుకుని అహాన్ని శూన్యపరచుకోవాలి.

## 23. ఆత్మశుద్ధి - విధానం

కొందరు ఆత్మశుద్ధి కోసం విభిన్న పద్ధతులను తెలిపే ప్రయత్నం చేశారు. ఇందులో భాగంగా వారు ఆత్మశుద్ధి విధానాల జాబితాను తయారు చేశారు. కానీ వాస్తవం ఏమిటంటే, ఆత్మశుద్ధి విధానాల జాబితా వంటిదేదీ లేదు. మీరు ఎంత సుదీర్ఘమైన జాబితను తయారుచేసుకున్నప్పటికిని అది ఆత్మశుద్ధి విధానాల సంకలనం కాజాలదు. ఆత్మశుద్ధి విత్పద్ధతులను ఏ జాబితా కవర్చేయలేదు. ఆ సుదీర్ఘ జాబితా కూడా కావలసినదానికంటే తక్కువ అన్న విషయం అనుభవాలు రుజువు చేస్తున్నాయి.

వాస్తవమేమిటంటే ప్రక్షాళనకు ఏ జాబితాతో సంబంధం లేదు. దాని సంబంధం వ్యక్తి నిర్ణయానికి ముడిపడి ఉంది. నిజంగానే మనిషి ఆత్మశుద్ధి కోసం చింతిస్తున్నట్లయితే, నిజాయితీగా తన ఆత్మశుద్ధి అవ్వాలని కోరుకుంటుంటే, అతను ఖచ్చితంగా ప్రక్షాలనను పొందుతాడు. కానీ ఈ విషయంలో గంభీరత, ఆసక్తి లేకపోతే తన ప్రక్షాళనకు ఏ వ్యాసమూ, ఏ ప్రసంగమూ పనిచేయదు.

తాను చేసే ప్రతి తప్పుకు ఏదో ఒక సమర్ధన (justification)ను కనుగొనటం మనిషిలో ఉన్న ప్రత్యేకలక్షణం. తన తప్పిదాన్ని సరైనదిగా నిరూపించుకోవడం కోసం మనిషి అందమైన పదాలను వెతుక్కుంటాడు. ఇటువంటి స్థితిలో ఏ సంస్కర్త, ఏ గురువు అతని ఆత్మశుద్ధి చేయలేడు. ఆత్మశుద్ధి కోసం వ్యక్తి తన గురించి ఒక సచేతన నిర్ణయం తీసుకోవటం తప్పనిసరి. అతను తన నిర్ణయానికి ఎట్టి పరిస్థితుల్లోనూ కట్టుబడి ఉండాలి. ఈ విషయంలో అతను ఏవిధమైన వంకలూ డొంకలు (excuses) వెతకరాదు.

ఆత్మశుద్ధి పొందాలన్న దృఢ సంకల్పమే ప్రక్షాళనకు మూలం. మనిషి, ఏ వస్తువు కూడా అతన్ని ఆత్మశుద్ధి నుండి తప్పించలేనంతగా దృఢ సంకల్పాన్ని కలిగి ఉండాలి. ఏ అనుమానమూ అతని సంకల్పాన్ని బలహీన పరచరాదు. ఈ విషయంలో

అతను ఎంతటి ఒత్తిడినైనా తట్టుకోవడానికి సిద్ధపడాలి. ఎంతటి ఆచరణాత్మక లేదా మానసిక మూల్యాన్ని చెల్లించాల్సి వచ్చినసరే, నేను ఖచ్చితంగా నా ఆత్మశుద్ధి చేసుకోవాలన్న కమిట్మెంట్ అతనిలో ఉండాలి.

## 24. ఆత్మశుద్ధి - అత్యంత ప్రభావవంతమైన విధానం

ఆత్మశుద్ధి చేసుకునే ఒక పద్ధతి ఏమిటంటే, నిర్దిష్టంగా (abstract) కొన్ని నియమాలను నిర్ణయించి వాటిని చదవటం కోసం కొందరికి ఇవ్వాలి. ఇది కూడా ప్రక్షాళనకు ఒక విధానం కాగలదు. అయితే, అత్యంత ప్రభావవంతమైన విధానం ఏమిటంటే, ఆ నియమాలను తాను ఎదుర్కొంటున్న పరిస్థితులకు అన్వయించడం. ఈ రెండో విధానం కోసం ఒక సజీవ సంస్కర్త లేదా ఆద్యాత్మిక గురువు అవసరం. మరో విధానం ఏమిటంటే మనిషి తన ఆలోచనా పటిమను ఎంతగా అభివృద్ధి చేసుకోవాలంటే, అతను స్వయంగా ప్రతి అనుభవంలో, ప్రతి పరిశీలనలో మనో పరిశుద్ధతను వెతికి దానిని తన మనస్సుకు ఒక భాగంగా జోడించుకోవాలి.

ప్రవక్త సహచరులలో మహనీయ అబూజర్ ఒకరు. ఆయన ఇలా అన్నాడు. దైవ ప్రవక్త ఒక పక్షి తన రెక్కల సహాయంతో ఆకాశంలో ఎగరడం చూస్తే, దాని ద్వారా మాకు దైవ సాక్షాత్కార విషయాలను గుర్తు చేసేవారు. (అల్తబ్కాతుల్ ఇబ్నెసాద్ -2354) పరిస్థితులకు అన్వయించి ఆత్మశుద్ధి బోధించే విధానానికి ఇది ఒక చక్కటి ఉదాహరణ.

ప్రక్షాళనకు ఏ నిర్దిష్ట విధానం లేదు. వాస్తవం ఏమిటంటే ఏ నిర్దిష్ట విధానమైనా ఆత్మశుద్ధికు ప్రభావంతమైన మార్గం కానేరదు. ప్రక్షాళనకు అత్యంత ప్రభావవంతమైన విధానం ఏమిటంటే మనిషి తనని తాను ఖురాన్లోని 15:75 యోచనాశీలునిగా తీర్చిదిద్దుకోవాలి. తన కళ్ళ ఎదుట జరుగుతున్న సంఘటనలకు ప్రక్షాళనతో ముడిపెట్టి దైవిక పాఠాలను పొందాలి. ప్రక్షాళనకు కావాల్సిన పదార్థాలు అన్నీ ప్రతిరోజు ఎదురయ్యే అనుభవాల్లో ఉంటాయి. నిత్యజీవితంలో ఎదురయ్యే

అనుభవాలను ఆత్మశుద్ధి దృష్టితో చూడటం నేర్చుకోవాలి. ఆ తర్వాత ప్రతి అనుభవం ప్రతి పరిశీలనా మీ కొరకు ఆత్మశుద్ధి మార్గం అవుతుంది.

## 25. ఆత్మశుద్ధి మాధ్యమం

ప్రక్షాలనకు మాధ్యమం ఏది? సాంప్రదాయకంగా కొన్ని విషయాలను ప్రక్షాళనకు మార్గాలుగా భావించడం జరుగుతుంది. స్వచ్ఛంద ప్రార్థనలు, ఖురాన్పఠనం, సాంప్రదాయిక ప్రార్థనలు, ధ్యానం, సాంగత్యం, మహనీయుల కథలు మొదలగునవి. ఈ విధమైన భావన ప్రక్షాళనను ఒక తాత్కాలిక కోర్సు లేదా మాన్యువల్ (manual)గా భావించడం వంటిది. కానీ వాస్తవం ఏమిటంటే ప్రక్షాళనకు ఏ నిర్ణీత కోర్సులేదు. ఆత్మశుద్ధి ఒక సజీవ సంఘటన. సజీవ ప్రక్రియ ద్వారా దీనిని వాస్తవరీతిలో పొందవచ్చు.

ప్రక్షాళనను పొందే అసలైన మార్గం మనిషి దైవిక విషయాలను అన్వేషించడం. ఈ అన్వేషణ ఆత్మశుద్ధి కోరుకునే వ్యక్తికి ఆహారం వంటిది. ఉదాహరణకు మీరు ఒక పక్షిని చూశారు. దాన్ని చూసి మీకు ప్రవక్తముహమ్మద్చెప్పిన ''స్వర్గవాసుల హృదయం పక్షిలా ఉంటుంది'' అనే హదీసు గుర్తుకు వచ్చింది.

ఆ తర్వాత మీరు మీ గురించి యోచన చేయటం మొదలు పెట్టారు. ''నా హృదయం కూడా పక్షి వంటిదేన? అని ప్రశ్నించుకున్నాను. నేను కూడా దానిలాగే ప్రతికూల ఆలోచనలు చేయకుండా ఉన్నాన?, దానిలా దురాశకు దూరంగా ఉన్నాన? దాని మాదిరే నేను కూడా ఎవరికీ హాని కలిగించని (harmless) వాడిన? ప్రకృతి నియమాలను పాటిస్తున్నాన?'' ఈ విధంగా ఆలోచించడం ప్రక్షాళనకు అసలైన చైతన్యం అని చెప్పవచ్చు. ఇటువంటి స్వయం ప్రకశాలింపజేసే ఆలోచన లేకుండా ఏ వ్యక్తి ఆత్మశుద్ధి పొందడు.

ఆత్మశుద్ధి వాస్తవరీతిలో తనను తాను నిర్మించుకునే ప్రక్రియ. ప్రక్షాళనలో మనిషి తన స్వయానికి తానే ముజక్కి (సంస్కర్త), ముర్షద్ (గురువు) అవ్వాల్సి

ఉంటుంది. మరోవ్యక్తి సాంగిత్యం లేదా ప్రబోధనం ఎవరికీ ప్రభావితం కానేరదు. ప్రక్షాళనలో ఏవ్యక్తి అయినా ప్రారంభమార్గదర్శకాలు ఇవ్వగలడేగాని, ఆ మార్గదర్శకాలను ముగింపు దాకా తీసుకెళ్లడం చేతిలోనే ఉంది. ఆత్మశుద్ధి ప్రక్రియలో ఇతర వ్యక్తి భాగం ఒక్క శాతం ఉంటే, అందులో మీ భాగం 99 శాతం ఉంటుంది.

## 26. ఆత్మశుద్ధి - మేధోవికాసానికి మూలం

ఆత్మశుద్ధి అసలు అర్థం హృదయ శుద్ధీకరణ (purification). ఇందులో అభివృద్ధి అనే మరో భావం కూడా ఇమిడి ఉంది. దీని ప్రకారం ఆత్మశుద్ధి అంటే మేధోవికాసం (intellectual development) లేదా ఆత్మవికాసం అని చెప్పటమే సరైనది.

మనసు (mind) స్థబ్దమైన (stagnation) వస్తువు కాదు. అది వృక్షంలాగా నిరంతరం పెరుగుతూనే ఉంటుంది. దీనినే ఖురాన్లో 48:4 ప్రకారం "విశ్వాసంతో పాటు మరింత విశ్వాసం పెంపొందించడం" అని చెప్పడం జరిగింది. విశ్వాసంతో పాటు మరింత విశ్వాసం రూపొందించడం అంటే మరింత ఎక్కువ అప్రమత్తంగా ఉండటం అని అర్థం. ఆ మరింత మీ అప్రమత్తత పేరే మేధోవికాసం. ఎప్పుడూ స్తబ్దతకు గురవ్వని విశ్వాసమే అసలైన విశ్వాసం. విశ్వాసం (ఈమాన్) అనేది దేవునిపై నమ్మకం ప్రాతిపదికన పెరుగుతూనే ఉంటుంది.

ఈ ఆత్మశుద్ధి లేదా మనో వికాసం ఏ విధంగా జరుగుతుంది అన్న ప్రశ్నకు, నిరంతర పరిశీలన, పరిశోధన (contemplation)నే మార్గం అన్నది సమాధానం. ఈ యోచనా స్వతహాగా నిరంతర ప్రక్రియ. ఖురాన్మరియుహదీస్ల గురించి లోతుగా యోచన చేయడం, దైవ ప్రవక్త జీవిత చరిత్ర గురించి, ప్రవక్త సహచరుల జీవితాల గురించి, ఇతరాత్ర మానవ నేపథ్యాల గురించి, సృష్టి గురించి, కణం నుండి సూర్యుని వరకు ప్రతిదాని గురించి ఆలోచన చేయడం వీటన్నిటితోపాటు సున్నితమైన చర్చల సమయంలో కూడా పూర్తిదృష్టిని కేంద్రీకరించడం మొదలగునవి.

ఏ వ్యక్తిలోనైతే నిజమైన విశ్వాసం ఉంటుందో అతని స్థితి ఎలా ఉంటుందంటే, ప్రతి అధ్యయనం, ప్రతి పరిశీలన అతనిపట్ల దైవిక దర్యాప్తుకు కారణమవుతుంది. అతని జీవితంలో ఎదురయ్యే ప్రతి అనుభవం దైవసామీప్యానికి మార్గం అవుతుంది. ప్రారంభ దశలో ఒక విత్తనంవలే ఉన్న అతని విశ్వాసం, వృద్ధి చెందుతూ వటవృక్షం అవుతుంది. ఈ మేధో మరియు ఆధ్యాత్మిక ప్రక్రియ యొక్క ఇస్లామియ పేరే ప్రక్షాళన. విశ్వాసం అనేది ఇస్లాంలో ప్రవేశించడానికి భూమికైతే, ఆత్మశుద్ధి విశ్వాసం వృద్ధిచెందడానికి మూలం.

## 27. ఆత్మశుద్ధి - జ్ఞానం

ఆత్మశుద్ధికు సంబంధించిన ఒక దృక్పథం ప్రకారం సాక్షాత్కార స్థితిని పొందిన సూఫీ సాంగీత్యం తప్పనిసరి.. కానీ దృక్పథం ఖురాన్మరియు హదీసుల ద్వారా నిరూపితం కాదు. వీటి ప్రకారం ఆత్మశుద్ధి అనేది మనిషి యోచన, ఆత్మపరిశీలన ద్వారానే సాధ్యమవుతుంది. ఒక వ్యక్తి సరైన స్వభావాన్ని కలిగి ఉండి, పుస్తకాలను, ప్రకృతిని అధ్యయనం చేస్తే వాటిద్వారా తన వ్యక్తిత్వ వికాసం కొరకు ఆత్మీయ వనరులు పొందుతాడు.

సూరెఫాతిర్లో పర్వతాల గురించి పేర్కొన్న తర్వాత ఈ క్రింది వాక్యం వస్తుంది.

“అల్లాహ్దాసులలో విజ్ఞాన సంపన్నులు మాత్రమే అల్లాకు భయపడతారు (35:28)” అంటే భయానికి మూలం జ్ఞానం. మనిషిలో ఎంత ఎక్కువ జ్ఞానం ఉంటే, అతను అంతే ఎక్కువగా అల్లాహ్సృష్టి ప్రణాళికను అర్థం చేసుకుంటాడు. ఆ విధంగా అతను తన దైవిక జ్ఞానంలో అభివృద్ధి సాధిస్తాడు. ఆత్మశుద్ధి అనేది ఏ వ్యక్తిలోనైనా అతని వ్యక్తిగత జ్ఞానం ద్వారానే లభిస్తుంది. అంతేకాని కాల్పనిక మహనీయుని మహిమ ద్వారా కాదు.

అధ్యయనం మనిషిలో ఆలోచనా శక్తిని పెంచుతుంది. అధ్యయనం మనిషిని విషయాలను లోతుగా ఆలోచించి ఆధ్యాత్మిక ఆహారాన్ని పొందే సమర్థునిగా

రూపుదిద్దుతుంది. ఉదాహరణకు ప్రతిమనిషి గాలి ద్వారా శ్వాస తీసుకుంటాడు. ప్రతివ్యక్తికి ఈ విషయమై అల్లాహ్కృతజ్ఞతలు తెలిపే అవకాశం ఉంది. కానీ ఏ వ్యక్తి అయితే, శ్వాసకోశ వ్యవస్థ (respiratory system) గురించిన ఆధునిక సమాచారం అంతా తెలుసుకుంటాడో, అతనిలో కృతజ్ఞతా భావం వెయ్యిరెట్లు పెరుగుతుంది. దీని ద్వారా అతని ఆత్మశుద్ధి అత్యధిక అభివృద్ధిని సాధిస్తుంది.

వాస్తవం ఏమిటంటే జ్ఞానం అనేది మనిషి ఆత్మశుద్ధికు అవసరమైన అత్యధిక ఫ్రేమ్వర్క్ (framework) ఇస్తుంది. జ్ఞానం ద్వారా మనిషికి తన ప్రక్షాళనలో అభివృద్ధికి తోడ్పడే కొత్త మార్గాలు తెలుస్తాయి. ఒక విధంగా ప్రక్షాళనకు జ్ఞానం బూస్టర్ (booster) వంటిదని చెప్పవచ్చు.

## 28. పరధ్యానం (distraction) నుండి మిమ్మల్ని మీరు రక్షించుకోండి

ఈ లోకంలో విజయం సాధించాలంటే ఒకదాని కోసం మరొకటి వదులుకోవడమనే ఒక నియమం ఉంది. ఇది మనస్తత్వ శాస్త్రం ప్రకారం మానవుడు రెండు విషయాలపై ఏక కాలంలో ఒకేవిధంగా దృష్టిపెట్టలేడు. ఒకదానిపై ఫోకస్చేస్తే మరోదానినుండి అతని దృష్టిమళ్లుతుంది. ఇదే నియమం ఆత్మశుద్ధి విషయంలోనూ వర్తిస్తుంది. ఏ వ్యక్తి అయితే ఆత్మశుద్ధి కోరుకుంటాడో, అతను కచ్చితంగా ప్రక్షాళనతో సంబంధం (irrelevant) లేని విషయాలను పూర్తిగా విడనాడటం తప్పనిసరి అవుతుంది.

ఆత్మశుద్ధి మార్గంలో అతిపెద్ద అడ్డంకి పరధ్యానం (distraction). ఆత్మ శుద్ధి పొందే వ్యక్తికి ఆత్మశుద్ధి పొందటమే తన అంతిమలక్ష్యం (supreme goal)గా చేసుకోవడం అవసరం. దృష్టి మళ్ళించే విషయాల నుండి అతను పూర్తి దూరాన్ని పాటించాలి. ఆత్మశుద్ధి కోసం ఏకాగ్రత ఎంతో అవసరం. ఏకాగ్రతలేని వ్యక్తి నిస్సందేహంగా ఆత్మశుద్ధి పొందలేడు.

ప్రతి వస్తువు ఒక మూల్యం ఉంటుంది. ఆత్మశుద్ధికు కూడా ఒక మూల్యం ఉంది అదే ప్రతి డిస్ట్రాక్షన్నుండి తనని తాను దూరం ఉంచడం. ఉదాహరణకు కుటుంబ ఆచారాలు, ఫ్రెండ్షిప్కల్చర్, తిండి, వస్త్రాల గురించి అత్యాసక్తి, సంపద, కీర్తి (fame) పొందాలనే అత్యాశ, లైఫ్ స్టయిల్ మొదలగునవి. ఈ విధమైనవన్నీ ఆత్మశుద్ధి కాంక్షించే వ్యక్తికి డిస్ట్రాక్షన్లాంటివి. ఆత్మశుద్ధి కాంక్షించే వ్యక్తి ఇటువంటి వాటన్నిటికీ దూరంగా ఉండాలి.

ఆత్మశుద్ధి సాధారణ వ్యక్తిని కూడా మహోన్నతునిగా మారుస్తుంది. ఆత్మశుద్ధి మానవునికి దైవదూతలు సత్సంగం లభించేలా చేస్తుంది. ఆత్మశుద్ధి మనిషికి దేవుని పొరుగులో జీవించే సమర్ధునిగా తీర్చిదిద్దుతుంది.

ఆత్మశుద్ధి లేని వ్యక్తి ఎండిపోయిన మొద్దులాంటివాడు. ఆత్మశుద్ధి అనంతరం వ్యక్తి పచ్చని వృక్షము అవుతాడు. ఆత్మశుద్ధి అనేది అధిక విషయం కాదు ఇది విశ్వాస స్ఫృహను మేలుకొలుపుకు సమానమైనది.

## 29. ఆత్మశుద్ధి - వర్తమాన అవసరాలు (challenges)

ప్రతియుగం యొక్క ఆలోచనా విధానం ఉంటుంది. వ్యక్తి ఏ విషయాన్ని అయినా అది అతని ఆలోచన విధానం ప్రకారం ఉన్నప్పుడే దాన్ని స్వీకరిస్తాడు. దీనిని మనసు యొక్క సంభోధన అంటారు. మానవ మేధస్సును పరిగణలోకి తీసుకోవటం ఏవిధంగానైతే ఇతరత్రా విశేషాలు అనివార్యం అదే విధంగా ఆత్మశుద్ధి విషయంలోనూ ముఖ్యమే.

పురాతన కాలంలో సాంప్రదాయికంగా ఆలోచించటం (traditional thinking) జరిగేది. కానీ, వర్తమానకాలం సాంకేతిక పరిజ్ఞాన యుగం. ప్రస్తుత కాలంలో లోకులు ఆత్మశుద్ధి కోసం వారి మేధస్సునూ అడ్రస్ (address) చేసే విధంగా బోధించడం అవసరం.

పురాతన కాలంలో ప్రక్షాళనకు మూలం ఏదో ప్రస్తుతకాలంలోనూ అదే మూలంగా ఉంది. అయితే రెండింట్లోనూ చిన్న తేడా ఉంది. అదే వాదించే శైలి, తార్కిక (reasoning) శైలి. పాతకాలంలో సంప్రదాయశైలి ప్రజలకు ప్రభావంతంగా ఉండేది. కానీ నేటి యుగంలో సమర్థవంతమైన ఆత్మశుద్ధి కోసం పారిభాషికాలను మార్చడం అవసరం. అట్లయితేనే, నేటి మానవునికి ఆత్మశుద్ధి ప్రాముఖ్యత తెలుసుకుని దానిని తమ జీవితాలు అలవరచుకోవడం సాధ్యపడుతుంది.

ఉదాహరణకు పాతకాలంలో ఆత్మ సంస్కరణ అనే పదం వాడబడేది. ఈ పదం పాత సాంప్రదాయిక మేధలను ప్రభావితం చేయడానికి సరిపోయేది. కానీ నేటి మానవుడికి ఈ పదాన్ని మార్చి చెప్పినప్పుడే వాస్తవాన్ని ఎక్కువగా అర్థం చేసుకోగలుగుతాడు. ప్రతి మానవుడు వివిధ కారణాల చేత ప్రభావితమైన మనస్సు (conditioned mind) కలిగి ఉంటాడు. అతని సంస్కరణ కోసం డీకండిషనింగ్చేయటం అవసరం. అతని మేధస్సును నవీనీకరించి (re- engineer-ing) విషయాలను వాస్తవరీతిలో చూసి, సరైన అభిప్రాయాన్ని ఏర్పరచుకునే సమర్థునిగా తీర్చిదిద్దాలి. ఈ విధమైన ప్రక్షాళనలో ప్రజలతో సంభాషించడం కోసం ఆత్మశుద్ధి చేసే వ్యక్తి అధ్యయనం విస్తృతంగా ఉండటం అవసరం. అతను ప్రాచీన విషయాలతో పాటు నవీన విషయాలపై కూడా అవగాహన కలిగి ఉండాలి. ఇలా కాకుండా ప్రభావం ఎంత మైనరీతిలో ఆధునిక మానవునికి ఆత్మశుద్ధి చేయడం కుదరదు.

## 30. ఆత్మశుద్ధి షరతు

ఆత్మశుద్ధి అనేది సాంకేతిక పరిజ్ఞానం (technical knowledge) కాదు. సాంకేతిక పరిజ్ఞానాన్ని పదాలలో స్పష్టంగా విడమరిచి చెప్పడం జరుగుతుంది. కానీ ఆత్మశుద్ధి మార్మికమైనది. మార్మిక జ్ఞానాన్ని పదాలలో కేవలం పాక్షికంగా మాత్రమే వివరించడం జరుగుతుంది కానీ సంపూర్తిగా కాదు. ఆత్మశుద్ధి కు సంబంధించిన

ప్రతి ప్రసంగం, ప్రతి వ్యాసం మరో ప్రసంగాన్ని, మరో వ్యాసాన్ని అధనం కావాలని కోరుతుంది. ఆత్మశుద్ధి ఆకాంక్షిస్తున్న వ్యక్తి మాత్రమే డిమాండ్ను పూర్తి చేయగలడు.

ఆత్మశుద్ధి పొందడం కోసం ప్రక్షాళించబడాలనే కాంక్ష ఎంతో తీవ్రంగా ఉండాలి. ఆత్మశుద్ధి కొరకు ఆమోదయోగ్యమైన మనస్సు (prepared mind) ఉండాలి. అంతేకాదు, అతనిలో ఏ విధమైన పక్షపాతాలు (prejudice) ఉండరాదు.

అతను సంక్లిష్టతల నుండి స్వతంత్రించబడిన (complex free) వ్యక్తి కావాలి. విషయాలను ఉన్నదున్నట్టుగా చూసే సామర్థ్యం అతనిలో ఉండాలి. వ్యక్తిగత పోకడలను వేరుచేసి విషయాలను చూడగలగాలి. తనకు అనుకూలమైన విషయాలను అతనెలా వినటానికి ఇష్టపడతాడో, ప్రతికూల విషయాలను కూడా అదేవిధంగా వినగలగాలి. సత్యాన్ని బేషరతుగా స్వీకరించగలగాలి. బహిరంగంగానే తన తప్పిదాలను ఒప్పుకోగలగాలి. అతను సరైన దృష్టికోణం (right angle of vision) లో వస్తువులను చూడగలగాలి.

ఆత్మశుద్ధి క్రియలో ఇద్దరు వ్యక్తులు పాల్గొంటారు. ఆత్మశుద్ధి చేసే గురువు, ప్రక్షాళించుకునే శిష్యుడు. వీరిద్దరిలో నుండి ఏ ఒక్కపాత్ర కూడా వందశాతం ఉండదు. ఈ వ్యవహారంలో వీరిద్దరి పాత్ర చెరో అర్ధభాగం ఉంటుంది. గురువు పాత్ర ఏమిటంటే, అతను ఆత్మశుద్ధి గురించి వాస్తవరీతిలో తెలుసుకొని ఉండాలి. అతను ఖురాన్మరియు హదీస్లలోతైన అధ్యయనం ద్వారా సరైన రీతిలో ప్రక్షాళనను అర్థం చేసుకొని దాన్ని యథాతథంగా బోధించగలగాలి.

ఈ వ్యవహారంలో మరో అర్ధభాగం ఆత్మశుద్ధి చేసుకునే విద్యార్థిది. శిష్యుడిలో సత్యాన్ని సంపూర్తిగా స్వీకరించగలిగే ప్రతిభ ఉండాలి. తన పూర్వ అభిప్రాయాల నుంచి బయటికి వచ్చి ఆత్మశుద్ధి పాఠాలను వినాలి. అర్థం చేసుకోవాలి. పూర్వం నిశ్చిత కొలమాణాల నుండి స్వతంత్రుడు కావాలి. తాను విన్న పాఠాలు, ప్రసంగాల ఆధారంగా తన అభిప్రాయాలను ఏర్పరచుకోవాలేగాని, గురువును బట్టి అభిప్రాయాన్ని ఏర్పరచుకోకూడదు. ఏ వ్యక్తిలోనయితే ఈలక్షణాలు ఉంటాయో, అతను ఆత్మశుద్ధి పొందటంలో విజేయుడు అవుతాడు.

## 31. సత్యాన్ని స్వీకరించుట

సత్యం యొక్క వాస్తవికతను అంగీకరించడం అత్యున్నత మానవత్వానికి ప్రమాణం. ఇది ప్రతి మనిషికి చాలా ముఖ్యమైనది. సత్యాన్వేషణ యొక్క సత్ఫలితమే అంగీకారం. మనిషికి ఒకవేళ సత్యం గురించి తెలియకపోతే, అతను అజ్ఞానిగా పరిగణించబడతాడు. సత్యాన్ని సంగ్రహించి కూడా ఏవ్యక్తి అయినా, అది అతని హృదయంలో ప్రతిధ్వనిస్తునప్పటికీ దానిని మాటలలో వ్యక్తం చేయకపోతే అది కపట విధానం అవుతుంది. వాస్తవాన్ని కనుగొన్న తర్వాత దానిని నిజమైన వ్యక్తికి కాకుండా మరొక వ్యక్తికి ఆపాదిస్తే, లేదా తానే స్వయంగా దాని క్రెడిట్తీసుకుంటే అలాంటి వ్యక్తి అబద్ధాలు చెబుతున్నట్టు.

ఇది సాధారణ విషయం కాదు. ఇది వాస్తవంగా సరైన దిక్కులో మానవ వ్యక్తిత్వ వికాసం చెందడం. దీని మరో పేరే ప్రక్షాళన. ఆత్మశుద్ధి అభౌతిక విషయం కాదు. మనిషి ప్రతి వ్యవహారాన్ని దేవుని ముంగిట్లో వేసేలా, ప్రతి అనుభవం దైవసామిప్యానికి దోహదపడేలా అతని అవగాహన పని చేస్తాది. ఈ అనుభవాలే అతడిని పరిశుద్ధమైన (purified personality) మహోన్నత వ్యక్తిత్వంగా తీర్చిదిద్దుతాయి.

వాస్తవం ఏమిటంటే ఈ వ్యవహారమంతా సరైన ఆపాదింపు (right attribution), తప్పుడు ఆపాదింపుకు (wrong attribution) సంబంధించినది. విషయాలను తప్పుడు రీతిలో ఎవరికైనా ఆపాదించడం తమ ఆత్మలను కలుషితం చేసుకోవడమే. ఇలా చేయడం ఆత్మశుద్ధి సమయంలోనే ప్రక్షాళనను కోల్పోవటం జరుగుతుంది.

దీనికి ప్రతిగా ప్రతి సంఘటనను నిజదేవునికి ఆపాదిస్తే ఆ వ్యక్తి తన ఆత్మను పైకెత్తుకున్నట్లే. ఆత్మశుద్ధి సందర్భాన్ని వినియోగించుకుంటూ తానని తాను ప్రక్షాలించుకున్న వ్యక్తి పరిశుద్ధునిగా పిలువబడతాడు. ఆత్మశుద్ధి శూన్యంలో జరగదు.

ఆత్మశుద్ధి ఎల్లవేళలా వాస్తవజీవితంలో జరుగుతుంది. ఆత్మశుద్ధి ఆవశ్యకమైనది జాగృత మేధస్సే (awakened mind) గాని, ఏకాంతంలో చేసే తాంత్రిక చర్యలు కావు.

## 32. ఆత్మశుద్ధి - త్యాగం

ఆత్మశుద్ధి పొందటం సాధారణ విషయం కాదు. ఇది అనునిత్యం ఒక త్యాగాన్ని కోరుకుంటుంది. అది శారీరక త్యాగం కాదు, మానసిక త్యాగం. ఆత్మశుద్ధి మార్గంలో అవరోధం అయ్యే విషయాలను సమూలంగా త్యజించడమే మానసిక త్యాగం అవుతుంది. ఒకటి పొందాలంటే మరొకటి కోల్పోవాలి అనేది ప్రకృతి ధర్మం. ఇతర విషయాల మాదిరిగానే ఆత్మశుద్ధి మార్గంలోనూ ఇదే ధర్మం వర్తిస్తుంది.

వాటిలో నుంచి ఒకటి చెడు అలవాట్లను (bad habits) విడిచిపెట్టడం. పరిసరాల ప్రభావం విద్య ప్రతి ఒక్కరు ఆత్మశుద్ధి మార్గంలో అవరోధం అయ్యేవాటికి అలవాటు పడతారు. దీనికి ఏ స్త్రీపురుషులు మినహాయింపు కాదు. పక్షాలను పొందటం కోసం వాటిని విడనాడటం తప్పనిసరి.

ఉదాహరణకి అతిక ప్రసంగాలు చేయటం, తక్కువగా ఆలోచించటం, కౌటుంబిక వ్యవహారాలలో తలమునకలవ్వటం. ఎల్లవేళలా తిండి గురించి, వస్త్రాల గురించి అత్యాసక్తి కలిగి ఉండటం, వినోద సమావేశాలలో కూర్చోవటం, ఇతరుల లోపల గురించి చర్చించడం, షాపింగ్ ఔటింగ్స్పేర్లతో పొదుపుకు బదులు వృథాఖర్చులు చేయటం, విలాసవంతమైన, ఆడంబరమైన అభిరుచులను ప్రదర్శించడం, పొగడ్తలకు పొంగిపోవడం, విమర్శలను తట్టుకోలేకపోవడం, ప్రాపంచిక భోగభాగ్యాల పట్ల దురాశ కలిగి ఉండడం, సింప్లిసిటీ (simplicity)కి బదులు ఆడంబరాలు కోరుకోవడం.

ప్రతి వస్తువు ఒక మూల్యం ఉంటుంది. ప్రక్షాళనకు కూడా ఒక మూల్యముంది. అది ఆత్మశుద్ధి అవరోధాలను విడనాడుటమే ఆ మూల్యం. ఆత్మ

శుద్ధి కోరుకున్న వ్యక్తి దానికి వ్యతిరేకమైన విషయాలను విడటానికి సిద్ధంగా ఉండాలి. అలా సిద్ధపడని వ్యక్తి నిస్సందేహంగా నిర్లక్ష్యమైన వ్యక్తే అవుతాడు. నిర్లక్ష్యవ్యక్తిత్వంతో ప్రక్షాళనకు జత కుదరదు.

వాస్తవం ఏమిటంటే, ఆత్మశుద్ధి కాంక్షించే విషయంలో అప్రమత్తంగా ఉన్న వ్యక్తి, ప్రక్షాళనకు అనువైన విషయమేదో, ప్రతికూల విషయమేదో తనకు తానే తెలుసుకుంటాడు. ఆ అప్రమత్తత ప్రక్షాళనకు అనువైన విషయాలను స్వీకరించమని, ప్రతికూల విషయాలను విడనాడమని అతడిని బలవంతం చేస్తుంది. వ్యక్తిని దూరమవకుండా ఆత్మశుద్ధి స్థాయికి ఖచ్చితంగా తీసుకువెళ్ళే పూచీ ఈ అప్రమత్తతదే.

## 33. ఆత్మశుద్ధి ఒక మానసిక ప్రక్రియ

వాక్యాలను వల్లించడం ద్వారానో, శారీరక వ్యాయామం ద్వారా ఆత్మశుద్ధి జరగదు. ఆత్మశుద్ధి పూర్తిగా ఒక మానసిక ప్రక్రియ, ఇది మానసిక స్థాయిలో మాత్రమే సిద్ధిస్తుంది. మానసిక ప్రక్రియ అంటే మేధో పరమైన క్రియ అని అర్థం. మానవ మేధస్సు అన్ని రకాల ఆలోచనలకు కేంద్రం. నిజానికి మానవ వ్యక్తిత్వాన్ని రూపొందించడంలో నిర్ణయాత్మక అంశం అతని మేధస్సుదే. అపరిశుద్ధ వ్యక్తిత్వాన్ని కూడా మేధస్సు నిర్మిస్తుంది. పరిశుద్ధ వ్యక్తిత్వాన్ని కూడా మేధస్సే నిర్మిస్తుంది.

ప్రక్షాళనకు అవసరమైనది మేధోవికాసమే (intellectual development). అంటే విషయాలను క్రమబద్ధీకరించే విధంగా ఆలోచనా పటిమను అభివృద్ధి చేసుకోవాలి. అది ప్రతికూల ఆలోచనలను సైతం సానుకూల భావాలుగా మలచగలగాలి. సృష్టిలోని ప్రతి వస్తువులలో సృష్టికర్త మహత్తులను కాంచగలగాలి. భౌతిక అంశాల్లో ఆధ్యాత్మికతను అన్వేషించగలగాలి. బాహ్యప్రభావాలకు లోనవకుండా సురక్షితంగా ఉండి ఆలోచించ గలగాలి. షైతాను పన్నె అందమైన పన్నాగాలను పసిగట్టి వాటిని తిరస్కరించి కలగాలి. మనోకాంక్షలను అధిగమించి ఆలోచించాలి. దూరదృష్టిని అలవరచుకోవాలి. ప్రతిఫలం లభించని పనులకు

దూరంగా ఉండాలి. నిజ శ్రేయోభిలాషిని గుర్తించాలి. అతని స్వభావానికి వ్యతిరేకంగా ఉన్నాసరే, ఉపదేశాలను స్వీకరించాలి. తనకు విరుద్ధంగా ఆలోచించగలిగే సామర్థ్యం కలగాలి. భౌతికాలను విడిచి ఆధ్యాత్మికతను తన లక్ష్యంగా చేసుకోవాలి. అతని ఆలోచనా విహంగాలు పరలోకం వైపు విహరించ గలగాలి.

ఈ క్రియలన్నీ మానసిక స్థాయిలో పరిపూర్ణం అవుతాయి. అవి మనిషి లోతైన ఆలోచనలతో సంబంధం కలిగి ఉంటాయి. లోతైన అవగాహన లేని వ్యక్తి ఆత్మశుద్ధి స్థాయికి చేరుకోలేడు. లోతైన అవగాహనఉన్న వ్యక్తిలో ఆత్మశుద్ధి ప్రారంభమవుతుంది. వాస్తవానికి ఆత్మశుద్ధి మనోశుద్ధికి మరోపేరు. ఆత్మశుద్ధి మొదట మానసిక స్థాయిలో ప్రారంభంఅవుతుంది. ఆ తర్వాత మనిషి పూర్తి అస్తిత్వంలో అది ప్రతిబింబిస్తుంది.

## 34. సానుకూల మనస్తత్వ ప్రాముఖ్యత

నాలుగువేల సంవత్సరాలకు పూర్వం మహనీయ ఇబ్రహీం తన భార్య హాజిరా, తన కుమారుడు ఇస్మాయిల్లను అరబ్ ఎడారిలో స్థిరపరిచారు. ఇస్మాయిల్పెరిగి పెద్దయ్యాక జుర్హుంతెగకు చెందిన ఒక మహిళతో వివాహం చేసుకున్నాడు. కొంతకాలం తర్వాత ఇబ్రహీం మళ్ళీ అక్కడికి వచ్చారు. అప్పుడు ఇస్మాయిల్భార్యతో ఆయనకు పరిచయం అయింది. తాను ఎదుర్కొంటున్న కఠినమైన పరిస్థితుల గురించి ఆవిడ ఇబ్రహీంకు ఫిర్యాదు చేశారు. ఇస్మాయిల్తిరిగొచ్చాక తన ఇంటి గుమ్మాన్ని మార్చమని నా మాటగా చెప్పు అని ఇబ్రహీం అక్కడ నుంచి వెళ్ళిపోయారు. ఆ తర్వాత ఇస్మాయిల్తన భార్యకు విడాకులు ఇచ్చేశారు. వేరే మహిళతో వివాహం చేసుకున్నారు. మహనీయ ఇబ్రహీం కొంతకాలం తర్వాత మళ్లీ అక్కడికి వచ్చారు. రెండో కోడలితో పరిచయమయ్యింది. ఆవిడ ఎటువంటి ఫిర్యాదులు చేయలేదు. పైగా తానున్న పరిస్థితిపై కృతజ్ఞతలు తెలుపుకుంది. ఇది విన్న ఇబ్రహీం ఇస్మాయిల్వచ్చాక తన ఇంటి గుమ్మంని అలాగే

ఉంచమని అన్నాను అని చెప్పు అనంటారు. (సహీబుఖారి, కితాబ్ అహదీసుల్ అంబియా)

సహజ వాతావరణంలో కొత్తతరం ఏర్పడి ఏకేశ్వరోపాసన చేపట్టి ప్రపంచమంతటా వ్యాపింపచేయాలన్న లక్ష్యంతో ఇబ్రహీం తన సంతానాన్ని ఎడారిలో స్థిరపరిచారు. మహనీయ ఇబ్రహీం గురించి ప్రస్తావిత ఈ సంఘటన ద్వారా తెలిసిందేమిటంటే, ఈ మహత్కార్యాన్నికి నడుం కట్టిన కార్యకర్తల్లో సానుకూల మనస్తత్వంతో జీవించే లక్షణం అత్యధికంగా ఉండాలి. వారు ఫిర్యాదులు చేసే మనస్తత్వానికి దూరంగా ఉండాలి. దీని ద్వారా ఆత్మశుద్ధికు అత్యంత ఆవశ్యదాయక విషయం ఏమిటో తెలుస్తుంది. మానవుడు పూర్తిగా తనపని తాను ఏఫిర్యాదుల్లేని వానిగా చేసుకోవాలి. ఫిర్యాదులు చేసేందుకు అనేక కారణాలు ఉన్నప్పటికీ అతను పూర్తిగా సానుకూల మనస్తత్వం కలిగి ఉండాలి.

ప్రతికూల ఆలోచన ప్రక్షాళనకు మరణం వంటిది. సానుకూల ఆలోచన ప్రక్షాళనకు కావాల్సిన ఖచ్చితమైన షరతు. ప్రతికూల ఆలోచనలో మునిగిపోయే వ్యక్తి సైతానుకు లోబడి ఉంటాడు. అనుకూల ఆలోచనలు కలిగిన వ్యక్తి దైవదూతల సాంగీత్యంలో ఉంటాడు. దైవదూతలు సహకారం లేనిదే ఆత్మశుద్ధి జరగదు అన్నది జగద్విదితం.

## 35. ఆత్మపరిశీలన - ప్రక్షాళనకు మూలం

మహనీయ ఉమర్ ఇలా అంటారు. దేవుడు మీ లెక్కలు చూడకముందే మీరు ఆత్మపరిశీలన చేసుకోండి. (ముస్నదెఫారూఖ్ 2/618)

ఈ విధంగా లెక్కలుచూసుకోవడమే ప్రక్షాళనకు మూలం. ఏ ట్రైనింగ్వ్యాంప్ద్వారా ఆత్మశుద్ధి సాధ్యపడదు. ఆకాడెమికల్ ఆక్టివిటీస్ద్వారా ఆత్మశుద్ధి జరగదు. కర్మ కండలు, దీక్షల ద్వారా కూడా ఆత్మశుద్ధి జరగదు. ప్రక్షాళనకు ఏకైక మార్గం ఆత్మపరిశీలన. అనగా తన లెక్క (introspection) తానే చూసుకోవాలి.

తనకు తానే పర్యవేక్షకుడు అవ్వాలి. తన గురించి తానే యోచిస్తూ సంస్కరణ చేసుకోవాలి.

మానవుడు యోచన సామర్థ్యం కలిగిన ఏకైక సృష్టిరాశి. నిజానికి మానవుడు సంభావిత ఆలోచనలు (conceptual thoughts) చేయగల జంతువుగా నిర్వచించబడ్డాయి. మీరు కర్రను తొలిచి చెక్కముక్కలు తయారు చేయగలరు. మీరు ఇనుమును అచ్చు వేయగలరు. కానీ మానవుని విషయంలో తనకుతానే యజమాని. తన ఆకృతీకరణ తానే చేసుకుంటాడు. మనిషికి ఇష్టం లేకపోతే అతని వ్యక్తిత్వాన్ని మరెవ్వరూ మలచలేరు.

ఈ కారణం చేతనే వ్యక్తి ఆత్మశుద్ధి లేదా వ్యక్తిత్వ నిర్మాణంలో అన్ని విధాల ఆత్మపరిశీలనే మూలంగా ఉంటుంది. సంస్కర్త చేయవలసిందల్లా కేవలం వ్యక్తిలో ఆత్మపరిశీలన సామర్థ్యానికి కావాల్సిన ప్రేరణ (incentive)ను పెంపొందించడమే. నేను నా ఆత్మశుద్ధి చేసుకోకపోతే నాశనమైపోతాను అన్న ఆలోచన విధానం మనిషిలో పుట్టించాలి. నా సంస్కరణ జరగకపోతే కచ్చితంగా నేను శాశ్వతంగా సర్వనాశనం అవుతాను, నా ఆత్మశుద్ధి నేను చేసుకోవాలి, చేయవలసినంత ఈ రోజు చేయాలి, రేపు ఉంటుందో లేదో తెలీదు అన్న భావన అతనిలో జనింపజేయాలి.

తన ప్రతి తప్పిదానికి సమర్ధన (justification)లు వెతుక్కునే స్వభావం మనిషిలో ఉంది. తానే సరైనవాడినని నిరూపించుకోవటానికి తగిన కొన్నిపదాలు అతనికి లభిస్తాయి. ఆత్మశుద్ధి పొందాలంటే మనిషిలోని ఈ సమర్ధన స్వభావము శాశ్వతంగా అంతమొందించటం అనివార్యం. అయితే తనలోని ఈ స్వభావాన్ని అంతం చేయటం స్వయంగా అతని నియంత్రణలోనే ఉంది. వేరే ఎవరి చేతిలో లేదు.

## 36. ఆత్మపరిశీలన ఎలా చేసుకోవాలి

ప్రక్షాళనకు అసలైన మార్గం ఆత్మపరిశీలన (self introspection)

చేసుకోవడమే. అంటే తన గురించి ఆలోచన చేసుకోవాలి. తన మాటల గురించి, చేష్టల గురించి తానే విశ్లేషణ (analysis) చేసుకోవాలి. మరో మాటల్లో ఆత్మపరిశీలన అనగా తనకు తానే న్యాయనిర్ణేత అవ్వాలి, తనకు వ్యతిరేకంగా తానే ఆలోచించాలి. తన గురించి తానే నిష్పాక్షికంగా అంచనా వేసుకోవాలి.  ఈ విధమైన ఆత్మపరిశీలన లేకుండా ఆత్మశుద్ధి జరగదు.

మనిషిలో అత్యంత శక్తివంతమైన భావోద్వేగం అహం (ego). ఇది ఎంత తీవ్రమైనది అంటే ప్రతి వ్యక్తి తెలుసో తెలియకో ''నేనే - నేను కాక మరి ఎవరూ లేరు'' అన్నభావనలో బ్రతికేస్తాడు. దీనికారణంగానే మనసులో త్వరితగతిన స్వార్థమనస్తత్వం (self thinking) అనే మానసిక స్థితి జనిస్తుంది. . ఏ విధమైన తత్వం ప్రక్షాళనకు మరణ ప్రాయమైనది. తనకు వ్యతిరేకంగా ఆలోచించగలిగే, వినగలిగే యాంటీసెల్ఫ్‌థింకింగ్‌మనిషిలో జన్మించటం ప్రక్షాళనకు అనువైనది. ఉమర్లో ఈ యాంటీసెల్ఫింకింగ్ (anti- self thinking) స్వభావం ఎంత తీవ్రస్థాయిలో ఉండేదంటే, ఆయన ''నాలోని లోపాలు నాకు తెలియజేసిన వ్యక్తిని దేవుడు అమితంగా కరుణించాలి'' అనే అనేవారు.

మనిషిలో ఆత్మపరిశీలన స్వభావము తన నిస్సహాయంత (helplessness)ను కనుగొనటం ద్వారా జనిస్తుంది. ఆత్మశుద్ధి కాంక్షించే వ్యక్తికి అన్వేషణ స్థాయిలో ''నేను (sense of I)'' అనే భావన కేవలం భావన వరకే పరిమితం అయినది. ఈ భావనకు వెలుపల ఏ వస్తువుపైన దానికి ఏవిధమైన అధికారం లేదు. తన ఉనికిని నిలుపుకోవడంలో కూడా దీనికి ఏ విధమైన అధికారం లేదు. మరణ విషయంలోనూ లేదు, జీవితం మద్దతువ్యవస్థ (life support system) మీద కూడా ఏ విధమైన అధికారం లేదు. పరలోక న్యాయస్థానంలో కూడా ఏ అధికారం లేదు.

తన అధికారలేమిని గురించి తెలుసుకున్న వ్యక్తిలో కచ్చితంగా నిస్సహాయత భావన జనిస్తుంది. ఈ నిస్సహాయత అనే భావన మనిషికి ఆత్మపరిశీలన చేసుకోవడం తప్పనిసరి చేస్తుంది. ఇందులోనే ఆత్మశుద్ధి యొక్క వాస్తవ రహస్యం దాగిఉంది.

## 37. ప్రశ్న పత్రాన్ని ముందుగానే చూడటం

నిజంగానే ఆత్మశుద్ధి ఆకాంక్షిస్తున్న వ్యక్తికి తరచుగా దేవుని తరఫు నుంచి స్వప్నాలు చూపించడం జరుగుతుంది. భవిష్యత్తు కార్య ప్రణాళిక గురించి స్వప్నాలలోనే మార్గదర్శకం లభిస్తుంది. ఈ విధంగా పరిశుద్ధుడు అవ్వాలనుకున్న వ్యక్తికి తన ఎంపిక (choice) ను దృఢనమ్మకంతో ఎంచుకునే అవకాశం లభిస్తుంది. ఇటువంటి స్వప్నాలు రావటం, ఒక విద్యార్థికి పరీక్షకంటే ముందే ప్రశ్నాపత్రాన్ని చూసే అవకాశం రావడం వంటిది. ఆత్మశుద్ధి కాంక్షించే వ్యక్తి ఏదో ఒకదాన్ని ఎంచుకోవాల్సి వస్తుంది. ఇటువంటి పరిస్థితులలో ఆ వ్యక్తి దైవాన్ని వేడుకున్నట్లైతే, అతని సందేహాలను సంశయాలను నివృతపరిచి నమ్మకం వైపు అడుగులు వేసేలా దేవుడు అతనికి ఒక స్వప్నం ద్వారా కావాల్సిన మార్గదర్శకాలు చేస్తాడు.

ఇటువంటి స్వప్నం నిస్సందేహంగా దేవుని ప్రత్యేక కారుణ్యమని చెప్పవచ్చు. కానీ ఏ వ్యక్తి అయినా స్వప్నాన్ని చూసాక కూడా దాని నుంచి మార్గదర్శకం పొందకపోతే, అతని వ్యవహారం ప్రశ్నాపత్రం ముందుగానే చూసినప్పటికీ పరీక్షలో ఉత్తీర్ణుడు కాని విద్యార్థి వంటిది. ఆత్మశుద్ధి 50శాతం మానవ ప్రయత్నం 50% దైవప్రసాదితం. ఆత్మశుద్ధి కాంక్షించే వ్యక్తి నిరంతరం దైవాన్ని వేడుకోవాలి. ఈ వేడుకోలు అతనిని దైవంతో కలుపుతుంది. వ్యక్తి తన వ్యవహారాల విషయంలో దైవానికి ఇస్తికారహ్ (దేవునితో మేలు కొరకు చేసే వేడుకోలు) చేయాలి. ఇస్తికారాహ్చేయడ మంటే తన వ్యవహారాల విషయంలో దైవంతో కౌన్సిలింగ్ (counseling) చేయించుకోవడమే. భగవంతునితో కౌన్సిలింగ్చేయించుకున్న వ్యక్తి ఎప్పటికీ మార్గం తప్పడు.

భగవంతుడు ఒకవేళ ఈ వ్యవహారంలో ఏదైనా స్వప్నం చూపించినట్లు అయితే దేవుడు అతని ప్రశ్నపత్రాన్ని అతని కొరకు లీక్చేసినట్లు అర్థం చేసుకోవాలి. ఆ తర్వాత అతని కోసం రెండో ఛాయిస్మిగిలి ఉండదు. భగవంతుడు ఇంతటి

మార్గదర్శనం చేసినప్పటికీ ఏ వ్యక్తైనా ఆ మార్గదర్శకం స్వీకరించకపోతే అది అతను చేసే అతిపెద్ద క్షమించరాని నేరం అవుతుంది. భగవంతుడు ఇటువంటి వ్యక్తి చూపే ఏ సాకు (excuse)ను స్వీకరించడు. భగవంతుడు అటువంటి వ్యక్తిని తన సామీప్యం నుండి శాశ్వతంగా దూరం చేస్తాడు.

## 38. ఆత్మశుద్ధి - ప్రపంచ పరిత్యాగము

తరువాతి కాలంలో కొందరు ఆత్మశుద్ధి కోసం ప్రపంచాన్ని పరిత్యజించే పద్ధతి (సన్యాసత్వం)ని ఎన్నుకున్నారు. అయితే, ఆత్మశుద్ధి కోసం ప్రపంచం పట్ల మానసికంగా అయిష్టత అవసరం. ఆచరణాత్మక కోణంలో ప్రపంచాన్ని విడిచిపెట్టకూడదు. ఈ సన్యాస సిద్ధాంతం వాస్తవానికి ఇది సందేశదాతలు కాని వారి మేధలకు (product of non dawah missionary thinking) పుట్టినది. నిస్సంశయంగా మానవుడు ప్రపంచంలో నివసిస్తున్నాడు. కాబట్టి ప్రపంచాన్ని వదలటం అంటే మానవుడిని కూడా వదలటమే అవుతుంది.

ఏ కారణం చేతనైనా ఒకవ్యక్తిని విడిచి పెట్టడాన్ని సందేశదాత భరించలేడు. ఇతరులు మనిషిని మరే దృష్టితోనైన చూడగలరు. కాని సందేశదాత మానవుడిని సందేశగ్రహీత రూపంలో చూస్తాడు. సందేశదాత దృష్టిలో ప్రతి మనిషి సందేశ గ్రహితే. అతను పేదవాడు కాని, లేదా ధనవంతుడు కాని, సాధారణ వ్యక్తి కాని, లేదా ప్రత్యేకమైన వ్యక్తి కాని, పాలకుడు కాని లేదా పాలితుడు కాని, ప్రస్తుతం వ్యతిరేకించేవాడు కాని, దౌర్జన్యపరుడు కాని సందేశదాత దృష్టిలో ప్రతివ్యక్తి కేవలం మానవుడే. సందేశదాత అంతిమ లక్ష్యం ప్రతి మానవునికి సత్యసందేశాన్ని చేరవేయడమే.

ఫలానా వ్యక్తి ఈ ద్వారం నుండి ప్రవేశిస్తే, నేను మరో ద్వారం ద్వారా నిష్క్రమిస్తానని ఏ సందేశ దాత అనజాలడు. ఆ రాబోయే ఫలానా వ్యక్తి నా సందేశ గ్రహీత, కాబట్టి నేను చొరవ తీసుకుని అతనికి వివేకవంతమైన రీతిలో సత్యసందేశాన్ని

చేరవేస్తాను అని సందేశదాత భావిస్తాడు.

సన్యాసం తీసుకోవడమంటే సందేశగ్రహీతను వదులుకోవడమే. ప్రపంచాన్ని పరిత్యజించడం అంటే ఆచరణాత్మకంగా జనాలకు దూరంగా వెళ్ళిపోవటమే. సందేశం దాతకు కోరుకునేదే సందేశగ్రహీతని. ఒక వ్యాపారి దేన్నయినా వదులుకుంటాడు కానీ, తన గ్రాహకున్ని (customer) మాత్రం వదులుకోలేడు. ఆ విధంగానే ఒక సందేశం దాత ప్రతి దానిని వదులుకోగలడు కానీ సందేశం గ్రహీతను వదిలి వేరే ప్రదేశానికి వెళ్ళలేడు. సందేశ గ్రహీతతో ఉన్నప్పుడు సందేశదాత తనకు ఏ ప్రమాదం పొంచి ఉన్న, వస్త్రాల అంచుకు బురద అంటిన లెక్కచేయడు గాని, సందేశం గ్రహీతతో ఎడబాటును మాత్రం భరించలేడు.

ఒక విశ్వాసి ఏ విధంగా ప్రక్షాళనను కాంక్షిస్తాడో, సందేశ కార్యాన్ని అంతే తీవ్రంగా కాంక్షిస్తాడు. ఒక నిజమైన విశ్వాసి ఎన్నటికీ ప్రక్షాళను వదులుకోడు, సందేశ కార్యం నుంచి చేతులు దులుపుకోడు.

## 39. ప్రక్షాళనకు ప్రేరకం

మంచి వ్యవస్థను స్థాపించడమే ఇస్లాం లక్ష్యమైతే ఆ వ్యవస్థ కోసం మంచి వ్యక్తుల ఆవశ్యకత ఉంది. మంచి వ్యవస్థను స్థాపించగల మంచి వ్యక్తులను నిర్మించడమే ఆత్మశుద్ధి ఉద్దేశం. ఈ మాటలో పైకి ఎటువంటి హాని కనిపించడం లేదు. కానీ, ఈ మాట నిస్సందేహంగా ఆత్మశుద్ధి ప్రక్రియకు మరణం వంటిది. ఇస్లాం పట్ల ఉన్న ఈ విధమైన భావన ఆత్మశుద్ధి ప్రక్రియను ప్రభావవంతమైన రీతిలో జరగనివ్వదు.

ఈ పరీక్ష ప్రపంచంలో మానవుడు ఎటు చూసిన ప్రక్షాళనకు ఆటంకం కలిగించే పరిస్థితుల్లో జీవించాల్సి వస్తుంది. ఇలాంటి స్థితిలో ఆత్మశుద్ధి ప్రక్రియ కొనసాగించడంకోసం బలమైన ప్రోత్సాహకం (strong incentive) అనివార్యం అయ్యింది. మనషి తన ఫోకస్ అంతా తన మీదే కేంద్రీకరించడమే ఆ బలమైన

ప్రోత్సాహకం అవ్వగలదు. అంతేగాని ఏ బాహ్య వ్యవస్థబలమైన ప్రోత్సాహకం కాజాలదు.

వాస్తవ ఆత్మశుద్ధి కోసం మనిషి ఆంతర్యంలో, ‘‘నా ఆత్మశుద్ధి జరగకుండా నేను విజయం సాధించలేను, నా ఆత్మశుద్ధి జరగని పక్షంలో కారుణ్యానికి శాశ్వతంగా దూరం అవ్వడమే తప్ప నాకు మరో ప్రయోజనం లేదు’’ అనే భావన కలిగి ఉండటం తప్పనిసరి. ఈ విధమైన బలమైన ప్రోత్సాహకం లేకపోతె ఏ వ్యక్తి ఎన్నటికీ ఆత్మశుద్ధి పొందలేడు. వాస్తవ ఆత్మశుద్ధి కోసం ఆత్మ పరిశీలన అవసరం. ఈ ఆత్మ పరిశీలన చేసుకునే తత్వం ఏబాహ్య వ్యవస్థ ప్రభావంతో మనిషిలో జన్మించదు.

నా ఆత్మశుద్ధి జరగని పక్షంలో నేనే నాశనము అవుతాను ఈ విధమైన బలమయిన ప్రేరకం మనిషి ప్రక్షాళనను చాలా వ్యక్తిగత సమస్యగా భావించినప్పుడే అతనిలో జనిస్తుంది. అంతేకానీ ఏ బాహ్య ఆసక్తుల వలనో లేదా అవసరాలన వలనో జనించదు. వ్యవస్థ అనేది ఒక బాహ్య వ్యవహారం దీనికి యావత్సమాజంతో సంబంధం ఉంది. వ్యవస్థ ద్వారా ఏ బలమైన ప్రేరకం మనిషిలో ప్రవేశించజాలదు. వాస్తవం ఏమిటంటే ఆత్మశుద్ధి ఎల్లవేళలా మనిషి వ్యక్తిత్వం ఆధారంగా అతని జీవితంలో ఒక భాగం అవుతుంది. దీనికి ఏ బాహ్య వ్యవస్థ ప్రభావంతో కాదు.

## 40. ఆత్మశుద్ధి కోసం సిద్ధమవడం.

నేటి భౌతిక ప్రపంచంలో ప్రతి వ్యక్తికి ఉద్యోగం అవసరం. ఉద్యోగాన్ని ఇంగ్లీషులో జాబ్ (job) ఏమంటారు. మంచి ఉద్యోగం దొరకాలని ప్రతివ్యక్తి కోరుకుంటాడు. దీని కోసం ప్రతి వ్యక్తి జాబ్మార్కెట్ అవసరాలకు అనుగుణంగా సంసిద్ధుడు (professionally prepared person) అవుతాడు. ఏ వ్యక్తి అయితే తనని తాను ఈ విధంగా తీర్చిదిద్దుకోడో అతను జీవితాంతం విఫలుడైన వానిగా నిలిచిపోతాడు.

పరలోక వ్యవహారం కూడా ఇదే విధంగా అంతకంటే అధికంగా

తీవ్రతరమైంది. పరలోకం మహోన్నతమైన దైవిక కార్యకలాపాల నిలయం. ఆధ్యాత్మికంగా సంసిద్ధుడై (spiritually prepared person) పరలోకానికి అనుగుణంగా ఇహలోకంలో ఏర్పాట్లు చేసుకున్నవాడే విజయేడు అవుతాడు. ఏవ్యక్తి అయితే ఇహలోకంలో తనని ఆధ్యాత్మికంగా సిద్ధపరచుకోడో, అతను పరలోకంలో విఫలుడు అవుతాడు.

ఈ వ్యవహారమంతా యోగ్యత (competence) కు సంబంధించినది. ఒక విధమైన యోగ్యత ఇహలోకంలో పనికి వస్తుంది. మరో రకమైన యోగ్యత పరలోకంలో పనికివస్తుంది. బహుదైవారాధన ఇహలోకంలో పనికివస్తే, ఏకేశ్వరోపాసన పరలోకంలో పనికి వస్తుంది. మనపై శ్రద్ధ (concern) వహించడం ఇహలోకంలో పనికి వస్తే, దేవునిపై శ్రద్ధ వహించడం పరలోకంలో పనికి వస్తుంది. పదార్థాలను భౌతిక కోణం (material angle)లో చూడటం ఇహలోకంలో పనికివస్తే, వస్తువులను ఆధ్యాత్మిక కోణంలో చూడటం పరలోకంలో పనికి వస్తుంది. స్వార్థం ఇహలోకంలో పనికివస్తే, నియమాలకు కట్టుబడి ఉన్న వ్యక్తి పరలోకంలో సఫలం అవుతాడు. అవినీతి ఇహలోకంలో పనికివస్తే, నిజాయితీ పరలోకంలో పనికివస్తుంది. తక్షణమే ప్రతిఫలం పొందాలనే అభిలాష ఉన్నవ్యక్తి ఈ లోకంలో సఫలీకృతం అవుతాడు. పరలోక ప్రేమ కారణంగా తన జీవితాన్ని నిర్మించుకున్న వ్యక్తి పరలోకంలో సాఫల్యం పొందుతాడు.

ఆత్మశుద్ధి అంటే తనని తాను పరలోక జీవితం కోసం సంసిద్ధం చేసుకోవడం, మరణాంతర జీవితానికి పనికివచ్చే సద్గుణాలను పెంపొందించుకోవడం అని అర్థం.

## 41. ఆత్మశుద్ధి అంశాన్ని వెదకటం

తన ఆలోచనను ప్రేరేపించడమే ఆత్మశుద్ధికి సాధనం. దీని పద్ధతి ఏమిటంటే, మీ జీవితంలో మీరు పెద్ద సమస్యలో చిక్కుకున్నప్పుడు దేవుడు మిమ్మల్ని తన ప్రత్యేక సహాయంతో కాపాడిన సందర్భాన్ని గురించి గుర్తుచేసుకోవడం దీనికి

మరో రూపం. ఇటువంటి దుర్ఘటనలు, క్లిష్ట పరిస్థితులు ప్రతి మానవుని జీవితంలో ఎదురవుతాయి. తర్వాత మనిషి వాటిని మరిచిపోతాడు.

ఆత్మశుద్ధిను కాంక్షించే వ్యక్తి తాను వినాశపుపంచుల మీద నిలబడ్డప్పుడు సర్వశక్తిమంతుడైన అల్లాహ్జ్యాక్యం చేసుకుని రక్షించిన సందర్భాలను నెమరు వేసుకోవాలి. ఇటువంటి సందర్భాలను తీవ్రంగా గుర్తు చేసుకోవాలి. ఓ దేవా నీవు నన్ను ఇహలోక జీవితంలో భయంకరమైన విపత్తుల నుండి అనేక మార్లు రక్షించావు, పరలోక భయంకరమైన శిక్ష నుండి కూడా నన్ను కాపాడమని వేడుకోవాలి.

ఈ విధంగా మీరు మీలోని లోపాలను వెతికి మీలో దోషిత్వ భావనను జాగృత్త పరచుకోవాలి. ఏదైనా వ్యవహారంలో 99% మీరే సరైనవారు అవ్వును గాక, ఒక్కశాతమే మీరు తప్పవ్వును గాక. మీరు ఆ 99% గురించి మర్చిపోయి ఒక్కశాతం గురించి తప్పంతా మీదే అన్నంత తీవ్రంగా తపించిపోవాలి. ఈ విధంగా మీలో జోషిత భావన మేల్కొంటుంది. మీరు దైవభీతితో కంపించిపోయి తీవ్రపశ్చాత్తాపంతో దైవానికి క్షమాపణలు చెప్పుకుంటారు.

ఆత్మశుద్ధి భౌతిక విషయమేమీ కాదు. ప్రక్షాళనకు సంబంధించిన అంశాల గురించి మాటిమాటికి ఆలోచించే అతి సాధారణ ప్రక్రియ. ఆత్మశుద్ధి అనేది ఎల్లవేళలా అవగాహనకు ప్రతిఫలమేగాని, మాంత్రికఫలం కాదని చెప్పవచ్చు. వ్యక్తి ఎంత ఎక్కువగా ఆత్మశుద్ధి గురించి ఆలోచిస్తే, అంతే ఎక్కువగా ఆత్మశుద్ధి పొందుతాడు. ఆత్మశుద్ధి అన్నివిధాలా అవగాహనతో కూడుకున్న ప్రక్రియ. అవగాహన లేకుండా ప్రక్షాళనం ఆశించటం ఎన్నటికీ నెరవేరని పగటికల (wishful thinking) వంటిది.

## 42. ఆత్మశుద్ధి ద్వారా సామీప్యత

మానవుడు సృష్టిరాశి, దేవుడు అతని సృష్టికర్త. దీని ప్రకారం తన సృష్టికర్తకు అత్యంత చేరువగా ఉండటం మానవ నైజం. కానీ గర్వం, ప్రతికూల ఆలోచన

మొదలగు వేర్వేరు విషయాలు మనిషిని దేవుని నుండి దూరం చేస్తాయి. మానవుడిని ఇటువంటి ప్రతికూల భావోద్వేగాల నుండి పూర్తిదూరంగా ఉంచడమే ఆత్మశుద్ధి లక్ష్యం. మనిషి ఎప్పుడైతే ఈ విధమైన అదైవిక భావోద్వేగాల నుండి శుద్ధి అవుతాడో, అప్పుడే తన దేవునికి చాలా దగ్గర అయినట్టు భావిస్తాడు. దైవం తన చుట్టుపక్కల ఉన్నట్లు (presence of God) అనుభూతి చెందుతాడు.

దేవుడి ఉన్నత గుణాలను అన్వేషించినప్పుడు, ఆ ఒక్క సందర్భంలోనే మానవుడు దేవునితో అత్యంత సామీప్యాన్ని పొందుతాడు. ఉదాహరణకు ప్రతిమనిషి ఈలోకంలో జీవించడం కోసం అసంఖ్యాక వస్తువుల మీద ఆధారపడతాడు. ఈ వస్తువులను అతను స్వయంగా సృష్టించలేదు. వీటిని ప్రసాదించిన వాడు ఒకడున్నాడు. ఆ ప్రదాత (giver) నిస్సందేహంగా దైవమే. వాటిని ప్రసాదించే ఏకైక అస్థిత్వం ఆ దేవునిదే. ఇవన్నీ నిస్సందేహంగా భగవంతుని తరఫున లభించిన ఏకపక్ష ప్రతిఫలాలు. వీటి ఆధారంగానే మనిషి ఈ లోకంలో మనగలుగుతున్నాడు. క్షణకాలమైనా ఈ ఏకపక్ష ప్రతిఫలాల పరంపర ఆగిపోయినట్లు అయితే మానవుడు తన ఉనికిని కాపాడుకోలేడు.

మనిషిలో ఈవిధంగా దేవుడే ప్రధాతనే విషయం ఆవిష్కృతమైనపుడు అతని ఆంతర్యంలో దేవునిపై ప్రేమసాగరం ఉరకలు వేస్తుంది. ఖురాన్లో "విశ్వసించిన వారు అల్లాహ్ను అంతకంటే ప్రగాఢంగా ప్రేమిస్తారు (2:165)" అన్న వాక్యానికి ప్రతిరూపంగా మారిపోతాడు. ఖురాన్లోని 96:19 లో సాష్టాంగం ద్వారా లభించే సామీప్యత గురించి ప్రస్తావించటం జరిగింది. సజ్దా ఎ ఖుర్బత్ (సామీప్య సాష్టాంగం) అంటే, ఏ వ్యక్తిలోనైతే దైవంపట్ల ప్రేమ, భీతి అంకితమై సాష్టాంగంలో పడిపోతాడో, ఆ వ్యక్తి చేసే స్పష్టంగానే సామీప్య సాష్టాంగమని చెప్పడం జరుగుతుంది. ఈ విధమైన సాష్టాంగం ఒక విశ్వాసి కొరకు అతని ఆత్మశుద్ధి ఆరోహణం అవ్వటం వంటిది.

## 43. ఆత్మ శుద్ధి - మరణస్మరణ

ఆత్మ శుద్ధి కొరకుమరణాన్ని స్మరించటం ఎంతో బలమైన సాధనం. మరణ స్మరణ ప్రక్షాళనను త్వరితం చేసే పరికరంగా పనిచేస్తుంది. మరణం స్మరణ మానవునిలో అత్యవసర భావన (sense of urgency) ని కలిగిస్తుంది. మరణం మనిషికి "ఆత్మశుద్ధి కోసం నీవు కాలయాపన చేయకూడదు, రేపు నీవు బ్రతికి ఉంటావో లేదో తెలీదు కాబట్టి ఈరోజే నీవు నీ ఆత్మశుద్ధి చేసుకో" అని గుర్తుచేస్తూ ఉంటుంది. మృత్యువు భావన మనిషికి "మరణ గడియా ఎప్పుడైనా సంభవించవచ్చు. ఆ క్షణం నీవు చనిపోవచ్చు. ఆ తర్వాత నీవు అతి తీవ్రమైన స్థితి ఎదుర్కోవాల్సి ఉంటుంది. దాని గురించి ఇలా రాసుంది ఆ రోజు జనులంతా సర్వలోకాల ప్రభువు ముందు నిలబడతారు ( 83:6).

ఆరోజు అందరూ సర్వలోకాల ప్రభువు ముందు నిలబడతారు. దైవదూతలు మానవుడిని తీసుకెళ్లి దేవుని సమక్షంలో ప్రవేశపెడతారు. గోచరఅగోచరాలన్ని దేవునికే ఎరుక. దేవుడు మానవుడి మాటల, చేష్టల లెక్కలు తీసుకుంటాడు. ఒక హదీసు ప్రకారం మానవుడు దేవుని ప్రశ్నలకు జవాబు చెప్పనంత వరకు అతని కాళ్ళుఅక్కడి నుంచి కదపలేడు.

మరణాన్ని స్మరించడం అంటే మానవుడు తన జీవితపు అతిసున్నితమైన క్షణాలను గుర్తు చేసుకోవటం. తప్పనిసరిగా అతని మీద సంభవించబోయే ఆ ఘడియ గురించి ఆలోచిస్తూ ఉండాలి. ఆ రోజు అతని శాశ్వత భవిష్యత్తు (eternal future) గురించిన తీర్మానం జరుగుతుంది.

ఈ ఆలోచన నిస్సందేహంగా మనిషిని నఖశిఖ పర్యంతం కంపించిపోయేలా చేస్తుంది. ఈ విధంగా మరణం గురించి ఆలోచించిన వ్యక్తి తన ఆత్మశుద్ధి గురించి చాలా ఆందోళన చెందుతాడు. మరణం రాక మునుపే, తన సంస్కరణ వ్యవది పూర్తవకముందే అతను అన్నివిధాలా తనని తాను ప్రక్షాళనం చేసుకోవడానికి తన శాయశక్తులా ప్రయత్నిస్తాడు.

## 44. ఆత్మశుద్ధి ఉద్దేశ్యం

సూరెజుమర్లో స్వర్గవాసుల గురించి ఈవిధంగా ప్రస్తావించబడింది.

"మరెవరయితే తమ ప్రభువుకు భయపడుతూ ఉండేవారో, వారు గుంపులుగుంపులుగా స్వర్గంవైపునకు పంపబడతారు. తుదకు వారు అక్కడకు చేరుకునేటప్పటికే దాని ద్వారాలు తెరువబడి ఉంటాయి. స్వర్గ పర్యవేక్షకులు వారినుద్దేశ్యించి, మీపై శాంతి కురియుగాక! మీరు హాయిగా ఉండండి. శాశ్వతంగా ఉండేటందుకు ఇందులో ప్రవేశించండి అంటారు. అల్లాహ్కా కృతజ్ఞతలు. ఆయన మాకు చేసిన వాగ్దానాన్ని నెరవేర్చాడు. మమ్మల్ని ఈ భూమికి వారసులుగా చేశాడు. ఇక స్వర్గంలో మేము కోరిన చోటల్లా ఉంటాము. మొత్తానికి (మంచి) కర్మలు చేసే వారికి లభించే ప్రతిఫలం ఎంతగొప్పది! అని వారు అంటారు. మరి నువ్వు, దైవదూతలు దైవసింహాసనం చుట్టూచేరి, తమ ప్రభువు పవిత్రతను కొనియాడటాన్ని, స్తోత్రం చేయటాన్ని చూస్తావు. వారి మధ్య న్యాయబద్ధంగా తీర్పు చేయబడుతుంది. "సకల లోకాల ప్రభువైన అల్లాహ్కా సర్వస్తోత్రాలు" అని అనబడుతుంది. (39:73-75)

ఖురాన్లోని మొదటి ఆద్యాయంలో "అల్హాందులిల్లాహిరబ్బిల్ ఆలమీన్" అనే వాక్యం ఇహకానికి సంబంధించింది. జుమర్సూరా (39:75)లో ఇదే వాక్యం పరలోకానికి సంబంధించి ఉల్లేఖించబడింది. దీని ద్వారా తెలిసింది ఏమిటంటే, మానవుని ద్వారా ఆశించబడుతున్నది దేవునికి స్తోత్రం చేయటమే. ఇహపరలోకాలలో దీని గురించే ఆశించడం జరిగింది. పరలోకానికి పనికివచ్చే స్తోత్రాన్ని తమ జీవితంలో ఒక భాగం చేసుకున్న పరిశుద్ధాత్మ (purified souls) లను ఉనికిలోకి తీసుకురావడే ఆత్మశుద్ధి ఉద్దేశ్యం.

ఈ లోకంలో మనిషి చేయాల్సిన పని నాగరికత (civilization)ను ఉనికిలోకి తీసుకురావటం. మనిషి ఈ పనిని సంతోషంగా నిర్వర్తించాడు. రాతియుగం (stone

age) మొదలుకుని ఎలక్ట్రానిక్యుగం (electronic age) దాకా నాగరికతను చేరవేశాడు. ఈ పని ప్రకృతి నియమాలను గుర్తించడం ద్వారా సాధించడం జరిగింది. ఈ క్రమంలో మానవుడు ఒక సరైన పనిలో తప్పుడు పని కలగాపులగం చేసేశాడు. ప్రకృతి నియమాలపై ఆధిక్యత సాధించిన తర్వాత అతను తలబిరుసు వాడైపోయాడు. నిరంకుశ వ్యవస్థ (despotic system)ను స్థాపించాడు. స్వేచ్ఛ పేరుతో అరాచకం (anarchy) వ్యాప్తి చేశాడు. ఫ్యాషన్పేరుతో విశృంఖలత్వాన్ని (nudity) ప్రచారం చేశాడు.

కాబట్టి తీర్పు దినానా పుణ్యాత్ములను నియామకం చేసి, వారిని దైవిక నాగరికతను అత్యంత ఉన్నత స్థాయిలో స్థాపించే అవకాశం ఇవ్వటం జరుగుతుంది. దీని గురించి ఖురాన్లో ఒకచోట ఇలా తెలపడం జరిగింది.

సజ్జనులైన నా దాసులే భూమికి వారసులవుతారని మేము జబూర్ (గ్రంథం)లో హితబోధ అనంతరం వ్రాసిపెట్టాము. (21:105)

నిజానికి మానవ జీవితం మార్మిక యాత్ర. ప్రపంచంతో మొదలైన ఈ ప్రయాణం పరలోకం దాకా సాగనుంది. ఇహలోకంలో ఈ ప్రయాణం పరిమితంగా సాగుతుంది. పరలోకంలో ఈ ప్రాయాణం అపరిమితంగా సాగనుంది. ఆత్మశుద్ధి పొంది తనని తాను అర్హుడిగా మార్చుకున్న వ్యక్తే ఈ ప్రయాణాన్ని విజయవంతంగా పూర్తి చేయగలడు. ఖురాన్లో ఈ క్రింది విధంగా తెలపడం జరిగింది.

భూమండలంలో ఉన్న వృక్షాలన్నీ కలములుగా, సముద్రాలన్నీ సిరాగా మారినా, ఆపైన మరో సప్తసముద్రాలు (సిరాగా) చేరినా అల్లాహ్ మాటలు (రాయటానికి) పూర్తికావు. నిస్సందేహంగా అల్లాహ్ సర్వాధికుడు, వివేకవంతుడు. (31:27)

పైన ప్రస్తావించబడిన విషయం కేవలం సమాచారం కాదు, ఇది ఒక ఆజ్ఞ. ఆ రాతను మనం కొనసాగించాలనే ఉద్దేశంతో ఖురాన్లో నమోదు అయ్యింది. అంటే, విశ్వాసులు అల్లాహ్సూచనలను అన్వేషించి తమ మార్మిక విజ్ఞానాన్ని నిరంతరాయంగా పెంపొందించుకోవాలి. ఖురాన్లోని మొదటి వాక్యం అల్హాందులిల్లా హిరబ్బిల్ ఆలమీన్.

ఈవాక్యం కూడా కేవలం సమాచారం కాదు ఇది కూడా ఒక ఆదేశం. ఈ వాక్యం కూడా మార్మిక అన్వేషణకు సంబంధించిన ప్రాపంచిక మూలాన్ని తెలియజేస్తుంది. ఇదే వాక్యం ఖురాన్లో మరోచోట పరలోకానికి సంబంధించి "సకల లోకాల ప్రభువైన అల్లాహ్కు సర్వస్తోత్రాలు (39:75)" అని పేర్కొనటం జరిగింది. ఈ వాక్యం దైవిక జ్ఞనాన్వేషణకు సంబంధించిన మరోఘట్టం గురించి తెలియజేస్తుంది. ఇది పరలోకంలో అత్యంత శ్రేష్టమైన వాతావరణంలో శాశ్వతంగా కొనసాగుతుంది.

ఒక హదీసులో ఇలా తెలుపబడింది.

సర్వశక్తిమంతుడైన అల్లాహ్మతరహిత వ్యక్తి (సెక్యులర్) నుండి కూడా తన మతం యొక్క సహాయం తీసుకుంటాడు. (సహీబుఖారి: 4203)

ఈ హదీసుల్లో ఏ మతపరమైన సహాయం గురించి ప్రస్తావించబడిందో, దాని అతిపెద్ద ఉదాహరణ 19, 20వ శతాబ్దాలలో శాస్త్రవేత్తలు చేసిన ఆవిష్కరణలు అని చెప్పవచ్చు. మార్మిక విజ్ఞానాన్ని పొందటం కోసం వారు ఒక సైంటిఫిక్ఫ్రేమ్వర్క్ (scientific framework) ఇచ్చారు. పరలోకంలో ఈ మార్మిక ప్రయాణాన్ని కొనసాగించడం కోసం విశ్వాసులకు చాలా గొప్పస్థాయిలో ఉన్న సహాయకులు లభిస్తారు. దైవదూతలే ఆసహాయకులు. "ప్రాపంచిక జీవితంలో కూడా మేము మీ నేస్తాలుగా ఉంటూ వచ్చాము. పరలోకంలో కూడా ఉంటాము. (41:31)"

## 45. ప్రక్షాళనకు ప్రమాణం

ప్రక్షాళనకు ప్రమాణం (criterion) ఏమిటి? ఒకవ్యక్తి ఇస్లామీయ ఆలోచనా సరళిని, ఇస్లామీయ జీవన శైలిని హృదయ ఘోషగా అనుభూతి చెందటమే ప్రక్షాళనకు ప్రమాణం అవుతుంది. ఈ వ్యవహారంలో అతను లాభనష్టాలను బేరీజు వేయకుండా దాన్ని స్వీకరించగలగాలి.

ఆత్మశుద్ధి అంటే అల్లాహ్తో సంబంధం కలిగి ఉండటం అని చెప్పడం జరిగింది. ఇది ఎంతో సరైనది. దీనిని మరోమాటలో చెప్పాలంటే మనిషి తన ధ్యాస

(sole concern)ను కేవలం ఒకే అస్తిత్వం మీదే కేంద్రీకరించడం ఆత్మశుద్ధి గుర్తు. ఆ ఏకైక అస్తిత్వమే అల్లాహ్. దీని పారిభాషిక పేరే తౌహిద్ (ఏకేశ్వరోపాసన). అంటే, బహుదైవారాధనను ఆసాంతం విడనాడి పూర్తిగా అల్లాహ్వైపు మరలడం.

భగవంతుడినే తన ఏకైక చింతనగా చేసుకోవడం మామూలు విషయం కాదు. ఇది మానవ అస్తిత్వంలో జన్మించిన సంపూర్ణ విప్లవానికి సమానం. ఇటువంటి వ్యక్తి పరిస్థితి ఎలా ఉంటుందంటే, అతను దైవాన్నే సంపూర్ణ ప్రదాత (giver)గా భావింపనారంభిస్తాడు. తనని తాను గ్రహీత (taker) గా గుర్తిస్తాడు. అతని ఆలోచన విధానం దైవిక ఆలోచన విధానం అవుతుంది. అతను భావావేశాలకు దేవుడే కేంద్రం అవుతాడు. అతని మాటల్లో చేతల్లో దేవుని రంగు కనిపిస్తుంది. అతనిలో వినయము (modesty) ఉత్కృష్ట స్థాయిలో జనిస్తుంది. అతను ఒక కుదించబడిన (man cut to size) వ్యక్తి అవుతాడు. ఇతరులపట్ల అతని హృదయంలో ద్వేషం కాకుండా శ్రేయోభిలాష జనిస్తుంది. అతని ద్వారా జనాలకు అహంకారానికి బదులు వినమ్ర అనుభవం లభిస్తుంది. అతను ప్రతి వ్యవహారంలో తన పొరపాటును వెతుక్కుంటాడు. అంతేకానీ ఇతరులను దోషులుగా నిలబెట్టే ప్రయత్నం చేయడు. అతను మాట్లాడటంకంటే మౌనంగా ఇష్టపడతాడు. ముందుసీటు ఆక్రమించే బదులు వెనకసీటు తీసుకోవడానికి ఇష్టపడతాడు. అతను ప్రతిమాటకు ముందు అది దైవ సమక్షంలో స్వీకరించబడుతుందా? లేక తిరస్కరించబడుతుందా? అని ఆలోచిస్తాడు. ఏ విధంగానైతే ఒక సమూహంలో అప్రమత్తంగా ఉంటాడో ఆ విధంగానే ఏకాంతంలోనూ కూడా ఉంటాడు.

------- సమాప్తం --------

# MAULANA WAHIDUDDIN KHAN
## English Books Free Download

**CPS INTERNATIONAL**

Presenting Islam Relevant to the Modern Age

WEBSITE: **WWW.CPSGLOBAL.ORG**

CONTACT US AT: **INFO@GLOBAL.ORG**


## DISCOVER GOD

By Contemplating on His Creation

NAME OF BOOK

1. DISCOVERING GOD
2. REALIZATION OF GOD
3. ATTRIBUTED OF GOD
4. MAN AND GOD
5. REMEMBRANCE OF GOD
6. IN SEARCH OF GOD
7. GOD-ORIENTED LIFE
8. THE CONCEPT OF GOD
9. THE WAY TO FIND GOD

## RELIGION AND SCIENCE

Rational Interpretation of Religion

NAME OF BOOK

1. GOD ARISES
2. RELIGION AND SCIENCE
3. ISLAM: THE VOICEOF HUMAN NATURE
4. ISLAM AS IT IS
5. THE VISION OF ISLAM
6. DISCOVER ISLAM

## SEARCH FOR TRUTH

Creation Plan of God

NAME OF BOOK

1. THE PURPOSE OF CREATION
2. REFLECTIONS OF LIFE AND DEATH
3. THE FINAL JOURNEY
4. LIFE, DEATH AND BEYOND
5. SEARCH FOR TRUTH
6. MAN KNOW THYSELF
7. THE REALITY OF LIFE
8. THE PURPOSE OF LIFE
9. THE CREATION PLAN OF GOD
10. GOD AND LIFE HEREAFTER

## ISLAMIC SPIRITUALITY

Developing a Paradisiacal Personality

NAME OF BOOK

1. TAZKIYAH:PURIFICATION OF THE SOUL
2. LEADING A SPIRITUAL LIFE
3. SPIRITUALITY IN ISLAM

## WISDOM OF LIFE

Living in Hope and Positivity

NAME OF BOOK

1. LIVING IN HOPE: OPPORTUNITIES AMIDST PROBLEMS
2. THE SECRET OF SUCCESS
3. THE MORAL VISION

## THE QURAN

God’s Preserved Guidebook for Man

NAME OF BOOK

1. THE QURAN TRANSLATION ( IN 30 LNG)
2. QURAN COMMENTARY
3. DISCOVERING THE QURAN
4. THE QURAN: AN ABIDING WONDER
5. THE QURAN FOR ALL HUMANITY
6. QURANIC WISDOM
7. QURAN POCKET GUIDE
8. THE GOOD LIFE
9. A TREASURY OF THE QURAN

## APPLICATION OF PROPHETIC MODEL

Guidance for All Mankind

NAME OF BOOK

1. 100 PRINCIPLES FORPURPOSEFUL LIVING
2. MUHAMMAD: A PROPHET FOR ALL HUMANITY
3. THE PROPHET MUHAMMAD: A SIMPLE GUIDE TO HIS LIFE
4. AN ISLAMIC TREASURY OF VIRTUES
5. MUHAMMAD:THE IDEAL CHARACTER
6. WORDS OFTHE PROPHET MUHAMMAD
7. THE PROPHET MUHAMMADPOCKET GUIDE

## REDISCOVER ISLAM

**Differentiate between Islam and Muslims**

NAME OF BOOK

1. ISLAM REDISCOVERED
2. WHAT IS ISLAM?
3. A SIMPLE INTRODUCTION TO ISLAM
4. INTRODUCING ISLAM
5. PRINCIPLES OF ISLAM
6. THE TEACHINGS OF ISLAM
7. ISLAM AND SULTAN
8. THE MAN ISLAM BUILDS
9. SPIRIT OF RAMADAN
10. RAMADAN:A MONTH OF PURIFICATION

## ISLAM AND THE MODERN AGE

Interpretation of Islam in Contemporary Style

NAME OF BOOK

1. THE ROLE OF ULAMA INTHE MODERN AGE
2. ISLAM: THE CREATOROF THE
3. THE SEEKER’S GUIDE
4. SIMPLE WISDOM
5. ISLAM AND THE MODERN MAN
6. ISLAM IN HISTORY
7. THE REVOLUTIONARY ROLE OF ISLAM
8. ISLAM STANDS THE TEST OF HISTORY
9. THE SHARIAH AND ITS APPLICATION

## TRUE FACE OF ISLAM

Religion of Peace

NAME OF BOOK

1. THE CONCEPT OF JIHAD IN ISLAM
2. THE POLITICALNTERPRETATION
3. THE TRUE JIHAD
4. ISLAM AND HUMAN WELFARE
5. TABLIGH MOVEMENT
6. ISLAM POCKET GUIDE
7. ISLAMIC FUNDAMENTALISM

## WOMEN IN ISLAM

Builders of Humanity

NAME OF BOOK

1. WOMAN BETWEEN ISLAM AND WESTERN SOCIETY
2. WOMAN BETWEEN ISLAM AND
3. THE SECRET OF ASUCCESSFUL FAMILY LIFE
4. POLYGAMY AND ISLAM
5. CONCERNING DIVORCE
6. HIJAB IN ISLAM

## PEACE IN ISLAM

Peace for the Sake of Peace

NAME OF BOOK

1. THE IDEOLOGY OF PEACE
2. ISLAM AND PEACE
3. ISLAM AND WORLD PEACE
4. THE DAWN OVER KASHMIR
5. PEACE IN KASHMIR
6. HOW TO ESTABLISH PEACE IN THE HOLY LAND
7. THE AGE OF PEACE
8. NON-VIOLENCE AND ISLAM
9. MANIFESTO OF PEACE

## INTERFAITH DIALOGUE

For Mutual Learning and Peace-Building

NAME OF BOOK

1. NON-VIOLENCE AND PEACE-BUILDING
I IN ISLAM
2. MANIFESTO OF PEACE
3. UNIFORM CIVIL CODE

## THE ALARM OF DOOMSDAY

The Beginning of the End of Human History

NAME OF BOOK

1. INTERPRETATION OF HUMAN HISTORY
2. PARADISE: THE FINAL PHASE OF THE
3. GLOBAL WARMING: THE DIVINE WARNING OF DOOMSDAY

## CALL TO GOD

Conveying the Divine Message to All

NAME OF BOOK

1. THE CALL OF THE QURAN
2. RE-PLANNING OF THE ISLAMIC
3. THE PROPHETIC ROLE OF NOAH
4. DAWAH MADE SIMPLE
5. DAWAH: THE MISSION OF
6. CALLING PEOPLE TO GOD
7. ISLAMIC ACTIVISM
8. THE GARDEN OF PARADISE
9. THE ROAD TO PARADISE

## ISLAM

God-Centred Religion

NAME OF BOOK

1. DOES GOD EXIST?
2. THE DISCOVERY OF GOD
3. MAN DOES NOT STAND ALONE
4. MAN AND GOD
5. DOES THE WORLD OF THE HEREAFTER
6. THE DESTINATION OF MAN
7. THE IDEOLOGY OF LIFE
8. THE CREATION PLAN OF GOD

## ISLAM

God-Centred Religion

NAME OF BOOK

1. GOD-ORIENTED LIFE
2. THE IDEOLOGY OF PEACE
3. THE ROOT CAUSE OF TERRORISM
4. PEACE IN ISLAM
5. PEACE IN THE QURAN
6. THE IDEOLOGY OF SPIRITUALITY
7. TAZKIYAH: PURIFICATION OF THE SOUL
8. KASHMIR: AN INTRODUCTION TO PARADISE

## ISLAM


God-Centred Religion

NAME OF BOOK

1. GLOBAL WARMING OR DIVINE
2. THE CRISIS OF MUSLIMS
3. ABOUT THE QURAN
4. ABOUT THE HADITH
5. THE SPIRIT OF SALAT
6. RAMADAN: THE MONTH OF FASTING
7. ZAKAT: THE PRESCRIBED CHARITY
8. HAJJ:THE PILGRIMAGE TO MAKKAH

## LIST OF ENGLISH LEAFLETS

1. About the Hadith
2. About the Quran
3. Does God Exist?
4. Does the World of the Hereafter Exist?
5. Global Warming or Divine Warning
6. God-Oriented Life
7. Hajj: The Pilgrimage to Makkah
8. Kashmir: An Introduction to Paradise
9. Man and God
10. Man Does Not Stand Alone
11. Peace in Islam
12. Peace in the Quran
13. Ramadan: The Month of Fasting
14. Tazkiyah: Purification of the Soul
15. The Creation Plan of God
16. The Crisis of Muslims
17. The Destination of Man
18. The Discovery of God
19. The Ideology of Life
20. The Ideology of Peace
21. The Ideology of Spirituality
22. The Root Cause of Terrorism and Its Solution
23. The Spirit of Salat
24. Zakat: The Prescribed Charity



# Tazkiyah- ఆత్మశుద్ధి

## Purification of the Soul

(Telugu)

శరీరానికి భౌతిక ఆహారం అవసరం. ఆహారం దేహానికి చేరవేస్తే అది ఆరోగ్యవంతం అవుతుంది. అదే విధంగా ఆత్మకి కూడా ఆహారం అవసరం. అది ఆత్మకు చేరినప్పుడు ఆత్మ ఆరోగ్యవంతం అవుతుంది. ఈ ప్రక్రియనే ఆత్మశుద్ధి అంటారు. వ్యక్తి తనని తాను పరలోక జీవనానికి అనుగుణంగా నిర్మించుకోవడమే ఆత్మశుద్ధి ఉద్దేశ్యం. అంటే వ్యక్తి మరణాంతరం సంభవించే లోకంలో పనికి వచ్చే నైతిక, ఆధ్యాత్మిక మహోన్నత సద్గుణాలను తనలో అలవరుచుకోవాలి. దీని ప్రకారం తజ్కియ లేదా ఆత్మశుద్ధి ముఖ్య ఉద్దేశ్యం దైవిక నియమాలకు అనుగుణంగా వ్యక్తిత్వ నిర్మాణం జరగటం అని చెప్పటమే సరైనది.